జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 14 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 218 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: అమావస్య - 21:20:56 వరకు నక్షత్రంహస్త - 21:42:57 వరకు కరణంచతుష్పాద - 09:25:49 వరకు, నాగవ - 21:20:56 వరకు పక్షంకృష్ణ యోగంఐన్ద్ర - 22:01:52 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు

### ఓట్ల తొలగింపునకు ఈసి అడ్డుకట్ట

హైదరాబాద్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): ఓట్ల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు విధిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ సమయంలో ముసాయిదా జాబితా ప్రచురించక ముందు మొత్తంలో గరిష్టంగా 50, రోజుకు పది వరకు ఫారం-7లు ఇచ్చే

మిగతా 2లో..

## చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ..

### తెలుగు గంగ' నీటి విడుదల అంశంపై చర్చ!

విజయవాడ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అమరావతిలోని ఉండవల్లికి చేరుకున్నారు. సీఎం క్యాంప్ ఆఫీసుకు చేరుకున్న విజయ్‌కి ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ విద్యాశాఖ మంత్రి

మిగతా 2లో..



## చైనా కంటే మెరుగ్గా భారత

# ఆర్థిక వృద్ధిరేటు

- ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే లక్ష్యం
- భవిష్యత్ పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం
- భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా డిజిటల్ నైపుణ్యాలు
- బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): భారతదేశ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అన్నారు. దిల్లీలో బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ, ప్రస్తుతం భారత ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం అవుతుందని, డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తాయని అన్నారు. సాధికారతకు శక్తి అనే దృక్పథంతో తాను బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌కు వచ్చానని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అన్నారు. అధికారం ఎవరి చేతిలో ఉందనేది ముఖ్యం కాదని, ప్రజల ప్రయోజనం కోసం

మిగతా 2లో..

## పరీక్ష రోజే ఏఐతో ప్రశ్నపత్రాల తయారీ

### పేపర్ లీకేజీలకు చెక్ పెట్టే యోచన

### నందన్ నీలేకని కీలక ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, ప్రశ్నపత్రాల లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని యూఐడీఏఐ మాజీ ఛైర్మన్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సూచించారు. పరీక్ష జరిగే రోజునే ఏఐ సాయంతో ప్రశ్నపత్రాన్ని రూపొందించే విధానాన్ని

మిగతా 2లో..

## ఉపాధి హామీ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు

### ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులకు10 లక్షల లబ్ధి

హైదరాబాద్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): తెలంగాణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సుమారు 3,800 మంది ఉద్యోగులకు ఈ ప్రయోజనం కలగనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసింది.

మిగతా 2లో..



## ఒక్కొక్కరి అకౌంట్లో

# లక్షన్నర..

- ఒప్పంద కార్మికులకు రూ.5,500
- సింగరేణి కార్మికులకు బొనాంజా
- కార్మికులకు 34 శాతం దసరా బోనస్
- శాశ్వత కార్మికులుగా 38 వేల మంది
- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి

**సింగరేణి సంస్థలో 34 శాతం లాభాలను బోనస్ కింద ఉద్యోగులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీని ప్రకారం ఒక్కో సింగరేణి ఉద్యోగికి రూ.1,53,912 బోనస్ వస్తుందని చెప్పారు. ఒప్పంద కార్మికులకు మాత్రం రూ.5,500 ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈసారి సంస్థకు రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు.**



హైదరాబాద్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికుల శ్రమకు తగ్గ గుర్తింపు దక్కింది. సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాల్లో 34 శాతం మొత్తాన్ని ఉద్యోగులకు బోనస్‌గా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థకు రూ.1,754 కోట్ల లాభాలు వచ్చాయని భట్టి తెలిపారు. లాభాల వాటా పంపిణీ ద్వారా సంస్థ పరిధిలోని సుమారు 38 వేల మంది శాశ్వత కార్మికులకు తలా రూ.1,53,912 మేర బోనస్ అందనుంది. అలాగే 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 చొప్పున పంపిణీ చేయనున్నారు. సంస్థలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. పెండింగ్‌లో ఉన్న 300 మంది డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాలను రాబోయే 15 రోజుల్లో అందజేయనున్నారు. గనుల ప్రాంతంలో కార్మికుల మారుపేర్లకు సంబంధించిన సమస్యను కూడా పక్షం రోజుల్లోగా పరిష్కరిస్తారు. కొవిడ్ సంక్షోభ సమయంలో విధులకు రాలేక ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బంది తిరిగి విధుల్లో చేరేందుకు వన్ టైమ్ ఆప్షన్ కింద అవకాశం కల్పిస్తున్నారు. కార్మికులకు శాశ్వత గృహవసతి కల్పించేందుకు

మిగతా 2లో..



## దేశ ప్రజలంతా

# మాతో ఉన్నారు

- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు
- రాహుల్ గాంధి నివాసంలో తేనీటి విందు
- విందుకు హాజరైన ఇండీ కూటమి నేతలు
- కేంద్రంపై ఇక నుంచి ఉమ్మడి పోరాటం..
- ప్రజాస్వామ్య పునరుద్ధరణకై పోరాటం
- మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది
- జంతర్ మంతర్ హోదా రద్దు దుశ్చర్య
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- ఇండియా' కూటమి నేతల వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపై నిలబడి ఐక్యపోరాటం చేస్తున్నట్లు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన తన నివాసంలో 'ఇండీ' కూటమి నేతలకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టడమే

మిగతా 2లో..

## ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

- సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలి
- ప్రతిపక్షా విమర్శలను తిప్పికొట్టాలి
- నేతలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమెల్యేలు సైతం పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా

మిగతా 12లో..

## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్

- ఎన్‌హెచ్ 765పై గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్-శ్రీశైలం రోడ్డుపై ఎలివేటెడ్ కారిడార్
- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- పలు ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదముద్ర
- రాష్ట్రంలో కీలకప్రాజెక్టులకు మార్గం సుగమం
- మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): తెలంగాణలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి.. ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే లక్ష్యంతో ప్రతిపాదించిన ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో కేంద్ర

మిగతా 12లో..

## విదేశీ శక్తులతో కలిసి

# కమ్యూనిస్టుల కుట్ర

- ఇరువురు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు
- ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయి
- ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?
- ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు



హైదరాబాద్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మిగతా 12లో..



## ఉగ్రవాదంపై భారత్

# వెనక్కి తగ్గదు

- వారికి ఆశ్రయం లేకుండా చూడాలి
- బిమ్‌స్టెక్ దేశాలకు అమిత్‌షా పిలుపు
- బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల భేటీ
- దిల్లీలో తొలిసారిగా బిమ్‌స్టెక్ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బిమ్‌స్టెక్ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. దిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు.

మిగతా 12లో..

# సంపాదకీయం

## రెండింటితోనూ పెను ముప్పే!?

నేటి తరంలో కాలంతో పోటీ పడాలంటే కష్టమైనా పనే.. రోజురోజుకూ టెక్నాలజీ కొంత పుంతలు తొక్కుతుంది. ఇలాంటి తరుణంలో పోటీ పాడడం అంత సాధ్యం కాదు. కానీ దాని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్ళొచ్చు. కాని పెరుగుతున్న టెక్నాలజీ కూడా భవిషత్తులో, భవిషత్తు తరాలకు ఇబ్బందిగా మారవచ్చు. దానికి తోడూ ప్రపంచంలో దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం కూడా మానవాళికి తీవ్ర ముప్పుగా మారవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దాంతో ఏఐ దుర్వినియోగంపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఏఐని ఉపయోగించి జీవాయుధాలను రూపొందించడం ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని నివేదిక హెచ్చరించింది. జీవాయుధాల వల్ల భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడవచ్చు. అయితే, ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేసే అవకాశాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది లాన్సెట్ కమిషన్ నివేదిక. 35 మంది నిపుణులు తమ పరిశోధనా ఫలితాలను జర్మనీలో జరిగే ప్రపంచ ఆరోగ్య సదస్సు (వరల్డ్ హెల్త్ సమిట్)లో ప్రదర్శించనున్నారు. ప్రపంచ దేశాల మధ్య అణుయుద్ధం సంభవిస్తే దాని ప్రభావం యుద్ధం జరిగే ప్రాంతాలకే పరిమితం కాదు. అణు పేలుళ్ల వల్ల భారీ స్థాయిలో ధూళి, పొగ, ఇతర కణాలు వాతావరణంలోని పై పొరల్లోకి చేరి సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. దాంతో ఉష్ణోగ్రతలు పడిపోవం, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, ఆహార కొరత వంటి పరిణామాలు సంభవిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా పంటల దిగుబడి తీవ్రంగా తగ్గి కోట్లాది మంది ప్రజలు ఆకలి సమస్య ఎదుర్కోక తప్పదు. ఆహార సంక్షోభం మానవాళి మనుగడను కూడా ప్రశ్నార్థకంగా మారుస్తుందని నివేదిక హెచ్చరించింది.అణుయుద్ధం, ఏఐ దుర్వినియోగం మరో 15 ప్రధాన ముప్పులను 'లాన్సెట్' గుర్తించింది. వాయు కాలుష్యం, వాతావరణ మార్పులు, యాంటీబయాటిక్ రెసిస్టెన్స్, చిన్నారుల్లో పోషకాహార లోపం, సంప్రదాయ యుద్ధాలు, అంతర్జాతీయ ఆరోగ్య సహాయ నిధుల్లో కోతలు, అధిక మద్యపానం, అధిక రక్తపోటు, ఆదాయ అసమానతలు, విద్యా స్థాయులు తక్కువ ఉండటం, కొత్త మహమ్మారులు, ఊబకాయం, మానసిక సమస్యలు, ధూమపానం, వృద్ధాప్యంలో అనారోగ్యం. ఈ సమస్యలన్నీ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. ఉదాహరణకు, పేదరికం, విద్యా లోపం, పోషకాహార సమస్యలు ప్రజల ఆరోగ్యాన్ని బలహీనం చేస్తాయి. వాతావరణ మార్పులు ఆహార భద్రత, తాగునీటి లభ్యత, అంటువ్యాధుల వ్యాప్తిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రపంచ ఉష్ణోగ్రతల ప్రభావాన్ని అంచనా వేయడానికి పరిశోధకులు 'డిసెబిలిటీ–అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్స్' (డాలీ) అనే కొలమానాన్ని ఉపయోగించారు. అనారోగ్యం, వైకల్యం లేదా అకాల మరణాల కారణంగా కోల్పోయే ఆరోగ్యకర జీవిత సంవత్సరాలను అంచనా వేసారు. ఉష్ణోగ్రతల పెరుగుదల 4.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరకుండా, 1.8 డిగ్రీల సెల్సియస్ స్థాయిలో పరిమితం చేయగలిగితే.. 189 కోట్ల మంది ఆరోగ్యకర జీవిత సంవత్సరాల నష్టాన్ని నివారించవచ్చని నివేదిక అంచనా వేసింది. వాతావరణ మార్పులను నియంత్రించేందుకు దేశాలు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. పేద దేశాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి అంతర్జాతీయ సహాయ నిధుల్లో భారీ కోతలు పడినా లేదా సహాయం పూర్తిగా నిలిచిపోయినా 2100 నాటికి 150 కోట్ల మంది ఆరోగ్యకర జీవిత సంవత్సరాలను కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ నష్టంలో దాదాపు 70 శాతం ఆఫ్రికాలో సంభవించనుంది. ఇప్పటికే అక్కడ చిన్నారుల్లో పోషకాహార లోపం ప్రధాన సమస్య కావడం వైద్య సేవలు, టీకాలు, పోషకాహార కార్యక్రమాలకు నిధులు తగ్గి పరిస్థితులు దిగజారాయి. అధిక ఆదాయం ఉన్న దేశాల్లో ఊబకాయం, మానసిక సమస్యలు సవాళ్లుగా మారితే.. తక్కువ ఆదాయం ఉన్న దేశాల్లో అవిద్య, చిన్నారుల్లో పోషకాహార లోపం దెబ్బతీస్తాయి. 'ప్రస్తుత ప్రభుత్వ నేతలు తీసుకునే నిర్ణయాలు.. భవిష్యత్తు తరాల ఆరోగ్యం, సంక్షేమాన్ని ప్రభావితం చేస్తాయి' అన్నారు లాన్సెట్ కమిషన్ సహ అధ్యక్షుడు డాక్టర్ క్రిస్టోఫర్ ముర్రే కీలక. మూడు సంవత్సరాలకు ముందు అధ్యయనం ప్రారంభించినప్పుడు యుద్ధాలు, వాతావరణ మార్పులు, మహమ్మారులనే ప్రధాన ముప్పుగా భావించారు. ఇప్పుడు మానవాళి ఎదుర్కొనే ప్రమాదాల జాబితా పెరిగిందనీ, ముందుగానే గుర్తించి నివారణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలనీ కోరారు. 2100 నాటికి మానవాళి అంతమవుతుందని ఈ నివేదిక కచ్చితంగా చెప్పకపోయినా ఏఐ దుర్వినియోగం, అణుయుద్ధం, వాతావరణ మార్పులను నిర్లక్ష్యం చేస్తే ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. మరి ఇలాంటి తరుణంలో ప్రజల మనుగడకోసం ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకుంటే తప్ప ఈ పెనుముప్పును అరికట్టలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పరీక్ష రోజే ఏఐతో ప్రశ్నపత్రాల తయారీ

**మొదటిపేజీ తరువాయి..**



పరిశీలించాలని సూచించారు. ముందుగానే ప్రశ్నపత్రాలను తయారు చేసి భద్రపరిచే పద్ధతికి బదులుగా చివరి నిమిషంలో ప్రశ్నలను ఎంపిక చేసి పేపర్ రూపొందిస్తే లీకేజీలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. మంగళవారం భారత్‌లో నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న నీలేకని, దేశ పరీక్షల వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం పరీక్షలకు ముందుగానే ప్రశ్నపత్రాలను రూపొందించి, వాటిని భద్రపరిచి, పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేసే విధానంలో లీకేజీలకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రశ్నపత్రాల తయారీ విధానంలోనే మార్పులు తీసుకురావాలని నీలేకని సూచించారు. ఒకే ప్రశ్నపత్రాన్ని ముందుగానే సిద్ధం చేయడానికి బదులుగా, పెద్ద సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంకును రూపొందించాలని ప్రతిపాదించారు. పరీక్ష జరిగే రోజున, చివరి నిమిషంలో ఆ బ్యాంకు నుంచి ప్రశ్నలను ఎంపిక చేసి ప్రశ్నపత్రాన్ని తయారు చేయవచ్చని వివరించారు. ఇలా చేయడం వల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించాలనే అక్రమ ప్రయత్నాలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ప్రశ్నల బ్యాంకు నుంచి పరీక్ష జరిగే రోజే ప్రశ్నపత్రాన్ని రూపొందించేందుకు కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించవచ్చా? అన్న ప్రశ్నకు నీలేకని సానుకూలంగా స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరీక్షా పత్రాలను రూపొందించే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల (సీబీటీ) నిర్వహణను విస్తరించే అంశాన్నీ కమిటీ పరిశీలిస్తోందని నీలేకని వెల్లడించారు. ప్రస్తుతం ఇలాంటి పరీక్షలు రాయడానికి దేశంలో సుమారు 1.5 లక్షల ప్రదేశాల్లో సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలంటే ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం మరోసారి తెరపైకి తెచ్చింది. 2026 మేలో ప్రశ్నపత్రం లీక్ కావడంతో వైద్య విద్య ప్రవేశ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలకు దారితీసింది. అనంతరం అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో మార్పులను సూచించేందుకు జులైలో కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనికి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారు. ప్రశ్నపత్రాల భద్రత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పరీక్షల నిర్వహణ విధానాల్లో మార్పులు వంటి అంశాలపై కమిటీ పరిశీలన జరుపుతోంది. ఇక భారత్‌లో నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ ఎనిమిదో సంచికకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 500 మందికి పైగా ప్రముఖులు హాజరయ్యారు. 'ఏ వరల్డ్ ఇన్ ప్లే: డిఫైనింగ్ ద న్యూ లీవర్స్ ఆఫ్ పవర్' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహించారు. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, వాటితో ముడిపడిన అవకాశాలు, సవాళ్లపై చర్చించడంతో పాటు భవిష్యత్తులో ఆర్థిక అభివృద్ధికి అనుసరించాల్సిన మార్గాలపై అభిప్రాయాలను పంచుకుంటారు.

## చైనా కంటే మెరుగ్గా భారత

# ఆర్థిక వృద్ధిరేటు




**మొదటిపేజీ తరువాయి..**

దానిని ఎలా వినియోగిస్తున్నారనేదే అసలు ప్రశ్న అని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, డేటా, జ్ఞానం, ఆవిష్కరణలు శక్తి వనరులుగా ఆవిర్భవించాయని, లక్షలాది మందికి అవకాశాలు కల్పించడానికి వాటిని ఉపయోగించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. తొలిసారిగా ఈ ఫోరమ్‌ను భారత్‌లో నిర్వహించాలన్న నిర్ణయాన్ని మోదీ స్వాగతించారు. "ఏటా ఈ ఫోరమ్‌లో మనం ఆర్థిక వ్యవస్థ, ఇంధనం మొదలైన వాటి గురించి చర్చిస్తాం. తొలిసారిగా ఇది భారత్‌లో జరుగుతోంది. మైఖేల్ బ్లూమ్‌బెర్గ్ సరైన సమయంలో, సరైన ప్రదేశాన్ని ఎంచుకున్నారు" అని ప్రధాని మోదీ అన్నారు. సాంకేతిక పురోగతి వల్ల కలిగే ప్రయోజనాలు సమాజంలోని విస్తృత వర్గాలకు చేరాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. అధికారం కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకుండా, ప్రజలకు సాధికారత కల్పించేందుకు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. "సరైన ప్రశ్న ఏమిటంటే, ఈ శక్తిని ఎలా వినియోగిస్తున్నారు? సాంకేతికత కేవలం కొద్దిమందికి మాత్రమే ప్రయోజనకరంగా ఉంటుందా? లేదా కోట్లాది మందికి అవకాశాలు సృష్టిస్తుందా? జ్ఞానం కొద్దిమంది బలంగానే మిగిలిపోతుందా లేక అందరికీ సాధికారత కల్పిస్తుందా? అనేది. మన ఆలోచనా దృక్పథంలో మార్పు అవసరం. నియంత్రణ కంటే సాధికారతకు, పోటీ కంటే సహకారానికి, వ్యక్తిగత విజయం కంటే ఇతరులు విజయం సాధించడంలో సహాయపడడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. జ్ఞానం, ధనం, అధికారాన్ని ఒక ఉన్నత లక్ష్యం కోసం ఉపయోగించాలనే భావన భారతదేశానికి కొత్తేమీ కాదు. అధికారం నిజమైన విలువ దాని వినియోగ విధానంలోనే ఉంటుంది. నేటి కాలంలో ఈ తత్వాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మన వేల ఏళ్ల సంప్రదాయం ఇదే మనకు నేర్పింది. దీనిని మేము ఆచరణ ద్వారా నిరూపించామని" ప్రధాని మోదీ అన్నారు.ఈ సందర్భంగా భారతదేశ డిజిటల్ వ్యవస్థ గురించి, వివిధ వ్యాపారాలకు అది ఉపయోగపడుతున్న విధానం గురించి ప్రధాని మోదీ చెప్పారు. "మనం ఎవరికీ నష్టాన్ని కలిగించం. మనం ప్రపంచంతో కలిసి, ప్రపంచం కోసం ఎదుగుతాం" అని అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి అని ప్రధాని అభివర్ణించారు. దాని భాషా వైవిధ్యం, మీడియా స్వరూపం, పెరుగుతున్న సోషల్ మీడియా వినియోగదారుల సంఖ్య వంటివి విభిన్న దృక్కోణాల పట్ల మనదేశానికి ఉన్న స్వేచ్ఛాయుత దృక్పథానికి ఉదాహరణలు అని మోదీ పేర్కొన్నారు. భారత ఆర్థిక వృద్ధిలో డిజిటల్ శక్తి కీలక పాత్ర పోషిస్తుందని మోదీ అన్నారు. "అందుకే విదేశాల నుంచి వచ్చిన అతిథులను భారత్ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రయత్నించమని నేను చెబుతున్నాను" అని అన్నారు. "మన దేశంలో ఒక వీధి వ్యాపారి, ఒక కారు షోరూమ్ వేర్వేరు రకాల వ్యాపారాలు చేస్తుంటారు. వేర్వేరు స్థాయిల్లో వీరు పనిచేస్తారు. కానీ భారతదేశంలో ఇద్దరూ ఒక డిజిటల్ చెల్లింపు వేదికలను ఉయోగిస్తారు. ఇదే సమ్మిళిత సాంకేతిక శక్తి" అని అన్నారు.

## ఒక్కొక్కరి అకౌంట్లో

# లక్షన్నర..



**మొదటిపేజీ తరువాయి..**

మైనింగ్ పూర్తయిన ఖాళీ ప్రదేశాల్లో లేఅవుట్లు అభివృద్ధి చేసి.. నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరుతో స్థలాలు పంపిణీ చేస్తామని మంత్రులు తెలిపారు. సింగరేణి ఆసుపత్రులను కార్పొరేట్ ప్రమాణాలతో ఆధునీకరిస్తామని చెప్పారు. ఉద్యోగుల భద్రత కోసం అమలు చేస్తున్న ప్రమాద బీమా కింద శాశ్వత సిబ్బందికి రూ.1.2 కోట్లు, ఒప్పంద సిబ్బందికి రూ.40 లక్షల వరకు ఆర్థిక రక్షణ కల్పిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఇప్పటివరకు సంస్థలో 3,189 ఉద్యోగాలను భర్తీ చేశామని.. అందులో 2,437 కారుణ్య నియామకాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కోల్ బ్లాక్ వేలాల్లో గత పాలకులు పాల్గొనకపోవడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం సంస్థ కోసం కొత్త బొగ్గు బ్లాకులను దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు సొంత ఇంటి కల నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి పేర్కొన్నారు. అర్హులైన వారికి సింగరేణి ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారు. మైనింగ్ లేనిచోట లేఅవుట్ చేసి నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరుతో ఇళ్లు నిర్మించి అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో సింగరేణి ఆస్పత్రులు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయాల వల్లే సింగరేణి లాభాలు తగ్గాయన్న భట్టి చరిత్రలో వారు చేసినంత నష్టం ఎవరూ చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని 141 కోల్ బ్లాక్స్‌కు వేలం జరిగితే ఒక్క వేలంలో కూడా సింగరేణిని పాల్గొనకుండా చేశారని దుయ్యబట్టారు.సింగరేణి సంస్థలో 3,189 పోస్టులు భర్తీ చేశామని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన అంశంలో రాజకీయం చేస్తున్నారని, ఈ అంశంలో కూడా 2,437 కారుణ్య నియామకాలు చేసినట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను గుర్తించలేదని అన్నారు. సింగరేణి కార్మికులకు తమ హయాంలో రూ.1.2 కోట్లు, కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాము సింగరేణికి కొత్త కోల్ బ్లాక్‌లను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.అంతకు ముందు సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగారు. ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సింగరేణి బకాయిలతో పాటు కార్మికులకు రావాల్సిన లాభాల వాటా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా దిగిపోయే సమయానికి సింగరేణికి రూ.26 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు రూ.59 వేల కోట్లకు పెరిగాయని ఆరోపించారు. సింగరేణి సంస్థ మనుగడ కొనసాగాలంటే ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## దేశ ప్రజలంతా

# మాతో ఉన్నారు

**మొదటిపేజీ తరువాయి..**

ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. సుప్రీం కోర్టుతో పాటు ప్రధాన న్యాయమూర్తిపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తన పాత్రను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నట్లు రాహుల్‌గాంధీ తెలిపారు. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. జంతర్ మంతర్‌ను డినోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. దేశ ప్రజలంతా తమతో ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. సోమవారం దిల్లీ వీధుల్లో తాము చేపట్టిన నిరసనలకు హాజరై, మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీ వెనుక ఎవరున్నా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. జజుజ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం. నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు. అది ఒకే ఒక్క నిరసన. ఆ నిరసన లక్ష్యం కూడా ఒకటే. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు నాశమయ్యాయి. రాజ్యాంగాన్ని చింపివేశారు. నిజమైన ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు మేమంతా కలిసి పోరాటం చేస్తున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియను నాశనం చేశారు. ధ్వంసమైన ప్రజాస్యామ్యాన్ని పునరుద్ధరించడమే మా లక్ష్యం. జంతర్‌మంతర్‌ను డినోటిఫై చేయడాన్ని ఖండిస్తున్నాం. దేశ ప్రజలంతా మాతో ఉన్నారు. దేశ భవిష్యత్తు కోసమే మేము పోరాటం చేస్తున్నాం. నిన్న జరిగిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఓటు చోరీ వెనుక ఎవరు ఉన్నా శిక్ష అనుభవించాల్సిందే. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు.

## ఉపాధి హామీ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు

**మొదటిపేజీ తరువాయి..**

దసరా పండుగకు ముందు తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. దీర్ఘకాలంగా సేవలందించిన సిబ్బందికి పదవీ విరమణ సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో ఇది కీలక ముందడుగుగా నిలవనుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎఫ్‌టీఈ ఉద్యోగులు గ్రాట్యుటీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి సీతక్క చొరవతో ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు పడటంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ఎఫ్‌టీఈ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ ప్రయోజనం లభించనుంది. 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు సుమారు రూ.10 లక్షల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే.. ఉద్యోగికి అందే గ్రాట్యుటీ మొత్తం వారి సర్వీసు కాలం, వర్తించే నిబంధనలు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోని అర్హత ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది.

అందువల్ల ప్రతి ఉద్యోగికీ ఒకే మొత్తంలో గ్రాట్యుటీ వస్తుందని భావించకూడదు. కచ్చితమైన మొత్తాలు, చెల్లింపు విధానం, అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక జీవోలో స్పష్టం కానున్నాయి. ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పథకం అమలు, ఉపాధి పనుల నిర్వహణ, సంబంధిత పరిపాలనా బాధ్యతల్లో వీరు సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ తమకు వర్తించాల్సిన గ్రాట్యుటీ ప్రయోజనాల కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూడాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో తమ దీర్ఘకాల డిమాండ్‌కు గుర్తింపు లభించిందని ఉపాధి హామీ ఉద్యోగులు భావిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత వచ్చే ఆర్థిక అవసరాలను ఎదుర్కొనేందుకు గ్రాట్యుటీ ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ ఖర్చులు, వైద్య అవసరాలు, ఇతర జీవన వ్యయాల విషయంలో ఈ మొత్తం కొంత భరోసా కల్పించనుంది.

## ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు

**మొదటిపేజీ తరువాయి..**

అవకాశాన్ని బీఎల్ఏలకు సీఈసీ కల్పించింది. అయితే హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో వెలుగు చూసిన ఘటనపై స్పందించిన సీఈసీ ఫారం- 7లపై అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చింది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో ఒక వ్యక్తి గరిష్టంగా ఏడు ఫారం-7లు మాత్రమే ఇవ్వొచ్చునని సీఈసీ స్పష్టం చేసింది. ఫారమ్ 7లో పూర్తి వివరాలు, అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సంతకాన్ని ఈఆర్ఓ పరిశీలించాలి. ఫారం-7 దరఖాస్తు చేసిన వారికి నోటీసు ఇచ్చి వారి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలితే ఫారం-7 సమర్పించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని సీఈసీ తెలిపింది. ఫారం-7లపై సీఈసీ మార్గదర్శకాలను కలెక్టర్లు, ఈఆర్‌వోలకు పంపించారు. వాటిని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫారం-7పై తప్పుడు ఫారం సమర్పిస్తున్నారనే ఆరోపణలు అధికంగా వస్తున్నాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులను పరిశీలించి, అభ్యంతరం తెలిపిన వ్యక్తిని నేరుగా విచారించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. క్లెయిలు, అభ్యంతరాల స్వీకరణ సమయంలో కొత్త నిబంధన ప్రకారం ఒక ఓటరు గరిష్ఠంగా పది ఫారాలు మాత్రమే సమర్పించాలని ఉంది. ఈ నిబంధన ప్రకారం ఫారం-7 అందజేసిన వ్యక్తికి ఎన్నికల నమోదు అధికారి నోటీసు ఇస్తారు. ఒక్కో దరఖాస్తుదారుని వాంగ్మూలం నమోదు చేసుకుంటారు. ఫారం-7 పై దరఖాస్తుదారు సొంత సంతకం ఉండాలి. కేవలం రబ్బరు స్టాంప్ లేదా సీల్ ఉన్న దరఖాస్తులను స్వీకరించరు. అభ్యంతరం ఉన్న వారికి కూడా వాదన వినిపించేందుకు అవకాశం కల్పిస్తారు. ఈఆర్వోలు సంతృప్తి చెందాక ఓటర్ల నమోదు నిబంధనలు 1960లో 19, 20 నిబంధనల కింద దరఖాస్తును పరిష్కరిస్తారు. ఈ నిబంధన అమలు చేయాలని అన్నీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

మరోవైపు ఓటరు సర్వేలో కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించడంతో అర్హులైన ఓట్లు తొలగిపోయాయి. కొందరైతే తమకు నచ్చినట్లుగా ఓట్లను రద్దు చేశారు. బతికున్న ఓటర్లను చనిపోయిన వారి జాబితాలో చేర్చారు. అసలు ఎటువంటి సర్వే చేయకుండానే, ఓటర్లు ఇంట్లో ఉండట్లేదంటూ నివేదిక ఇచ్చారు. ఫలితంగా హైదరాబాద్ నగరంలోని మూడు జిల్లాల పరిధిలోగల 28 నియోజకవర్గాల్లోని 1.14 కోట్ల ఓటర్లలో 43 లక్షల మంది ఓట్లు (37.3 శాతం) తొలగిపోయాయి. దాంతో చాలా ప్రాంతాల్లో ఓటరు సర్వే బాధితులు కనిపిస్తున్నారు. మేము బతికున్నా చంపేశారంటూ కొందరు, స్థానికేతరులను చేశారని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. షేక్ మహమ్మద్ వయసు 68 ఏళ్లు. ఎన్నో ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని వివరాలతో ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి బీఎల్‌వోకు సమర్పించానన్నారు. అయినా తన ఓటును రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ..

**మొదటిపేజీ తరువాయి..**

నారా లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ మధ్య కీలక భేటీ జరిగింది. ఈ భేటీ సందర్భంగా ఇరు రాష్ట్రాల సంక్షేమం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు ప్రధానంగా 'తెలుగు గంగ' నీటి విడుదల అంశంపై ముఖ్యమంత్రులు చర్చించారు. చెన్నై నగరానికి తాగునీటి అవసరాలను తీర్చడానికి తగినన్ని కృష్ణా జలాలను విడుదల చేయాలని చంద్రబాబును తమిళనాడు సీఎం విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నుంచి చెన్నైకి 4.08 టీఎంసీల నీటిని అందించిన విషయాన్ని చర్చల్లో ప్రస్తావించారు. ఈ ఏడాది తెలుగుగంగ ద్వారా ఇప్పటికే 4.08 టీఎంసీల నీటిని ఏపీ ప్రభుత్వం తమిళనాడుకు అందించింది. అయితే, చెన్నై అవసరాల రీత్యా ఈ కోటాను మరింత పెంచాలని తమిళనాడు ప్రభుత్వం కోరుతోంది. దీనిపై స్పందించిన ఏపీ ప్రభుత్వం మానవీయ కోణంలో తాగునీటి అవసరాలకు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. అయితే వర్షపాతం, నీటి నిల్వలు, వాతావరణ పరిస్థితుల ఆధారంగా.. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నీటిని విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 'పోలవరం – కావేరి', 'గోదావరి – కావేరి' నదుల అనుసంధానంపై ఇరువురు సీఎంలు చంద్రబాబు, విజయ్ విస్తృతంగా చర్చించారు. సముద్రంలో వృథాగా కలిసిపోతున్న వేల టీఎంసీల గోదావరి వరద జలాలను మళ్లించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లోని లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుందని చంద్రబాబు అన్నారు. ఈ కీలక ప్రాజెక్టును సాకారం చేయడానికి పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని ఏపీ సీఎం ప్రతిపాదించారు. గోదావరి – కావేరి అనుసంధానంలో భాగంగా ఏపీ ప్రభుత్వం గోదావరి– బనకచర్ల కనెక్టివిటీని ప్రధానంగా ప్రతిపాదిస్తోంది. ఈ ప్రణాళిక ప్రకారం గోదావరి జలాలను మొదట కృష్ణా నదికి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఆ తర్వాత బొల్లాపల్లి నుంచి బనకచర్లకు, అక్కడి నుంచి పెన్నా నదికి నీటిని తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు. చివరగా కండలేరు రిజర్వాయర్ మీదుగా కావేరీ నదికి గోదావరి నీటిని చేరవేసేలా నమూనాను సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం మరియు పొరుగు రాష్ట్రాల సమన్వయంతో ఈ ప్రాంతీయ జల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం విజయవాడ పున్నమిఘాట్ కు వెళ్లనున్నారు విజయ్. సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ తో కలిసి విజయవాడ ఉత్సవ్ లో పాల్గొననున్నారు. మంత్రి నారా లోకేష్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ నీటి పొదుపును పాటించాలి

- ఒట్టు-బొట్టు బొట్టు ను ఒడిసి పట్టు
- చేతి పంపు కొట్టు- నీటిని బిందెలో పట్టు
- భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలి
- వృధాను అరికట్టాలి - చేతిపంపులతో చెలిమెల నీరు
- దన్నూరు బి పంచాయతీ పాలకవర్గం




**బోథ్,అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** మండలంలోని దన్నూరు బి గ్రామ పంచాయతీ పాలకవర్గం నీటిని వృధా ను అరికట్టే చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని చేతి పంపు బోరులను బాగు చేయించి కాలనీలలో గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా కరెంటు మోటార్ ద్వారా నడవడం మూలంగా నీరు అనేకంగా వృధా కావడం చూసి దానిని ఎలాగైనా అరికట్టాలని ఉద్దేశంతో చేతిపంపుల బోర్లను ఉపయోగించేలా ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులను దీటుగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్తగా నీటిని ఒడిసిపట్టే చర్యలను ఇప్పటినుండే గ్రామంలో తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో
రెడ్‌క్రాస్ సభ్యులు, సామాజిక సేవకులకు ఘన సన్మానం.





**నిర్మల్ టౌన్, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలానికి పైగా గడిచిన నేపథ్యంలో, నిర్మల్ జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం విశేషమని పలువురు పేర్కొన్నారు. ఈ క్రమంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్మల్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తదితర అధికారుల సమక్షంలో నూతన జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన జి. జనార్దన్‌తో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్నికల అధికారులు నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నికకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, పలు సంఘాల ప్రతినిధులు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలను పలువురు అభినందించారు. తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో సన్మానం

తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులతో పాటు సామాజిక సేవకులను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షుడు సాజిద్, ప్రధాన కార్యదర్శి అల్మాస్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సభ్యులను సత్కరించారు.

సామాజిక సేవ, మానవతా దృక్పథంతో ప్రజలకు సేవలందించే సంస్థలను ప్రోత్సహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తూ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా.. పేదల సంక్షేమం కోసం పోరాడిన యోధుడు గుండా మల్లేష్

- కామ్రేడ్ గుండా మల్లేష్‌కు విప్లవ జోహార్లు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్






**మంచిర్యాల, 13, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన పోరాట యోధుడు కామ్రేడ్ గుండా మల్లేష్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. గుండా మల్లేష్ ఆరో వర్ధంతిని పురస్కరించుకొని మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ గుండా మల్లేష్‌కు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ, గుండా మల్లేష్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిస్వార్థంగా పోరాడారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ, అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా గళమెత్తిన ప్రజా పోరాట యోధుడని కొనియాడారు. ప్రజా ఉద్యమాల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, నిరాడంబర జీవనశైలి, పోరాట స్ఫూర్తి కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శమని అన్నారు. కామ్రేడ్ గుండా మల్లేష్ ఆశయాలను కొనసాగిస్తూ, పేద ప్రజల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం కమ్యూనిస్టులు మరింత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, మొగిలి లక్ష్మణ్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు బియ్యాల రాజేశం, మండ యాదగిరి, సిరికొండ రాయమల్లు, కొడి వెంకటేష్, అచ్చ హరిష్ తదితరులు పాల్గొన్నారు.

# రాయదారి గ్రామంలో మురికి కాలువల శుభ్రత పనులు

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు






**మామడ అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి) :**
మామడ మండలంలోని రాయదారి గ్రామంలో మురికి కాలువల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, కాలువలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపిఓ శివాజీ, సర్పంచ్ బంక తిరుపతి పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు.

గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మురికి కాలువల నుంచి దుర్వాసన రాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామ ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనసూయ, వార్డు సభ్యులు మసిండ్ల భీమేష్, బంక రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కుంటాల, చిన్న బుగ్గారంలో పంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే






**నేరడిగొండ అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి అసలైన పునాది అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తెలంగాణలో పల్లెల సమగ్ర వికాసానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని ఆయన కొనియాడారు. నేరడిగొండ మండలంలోని కుంటాల, చిన్న బుగ్గారం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఆయన సోమవారం ఘనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, పల్లె ప్రగతి వంటి విప్లవాత్మక పథకాల ద్వారా రైతుల సంక్షేమం, ఇంటింటికీ తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుద్ధ్యం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైందని గుర్తుచేశారు.

నూతన పంచాయతీ భవనాల ప్రారంభంతో గ్రామ పరిపాలన మరింత సులభతరం కావడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా చేరువవుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి లాభాల వాటాపై ఉత్కంఠకు తెర!





**మంచిర్యాల, 13, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు ఈ ప్రకటన వెలువడింది. సింగరేణి సంస్థకు వచ్చిన సుమారు రూ.1,750 కోట్ల లాభాల్లో 34 శాతం వాటా కింద రూ.595 కోట్లను కార్మికులకు పంపిణీ చేయనున్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.1,53,912 చొప్పున లాభాల వాటా అందనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు వెల్లడించారు. గత నాలుగైదు నెలలుగా లాభాల వాటా ప్రకటన కోసం ఎదురుచూస్తున్న సింగరేణి ఉద్యోగుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ ప్రకటనతో తెరపడింది. అయితే నగదు చెల్లింపుల తేదీ ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

> **34 శాతం లాభాల వాటా ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
>
> **రూ.1,750 కోట్ల లాభాల్లో రూ.595 కోట్లు కార్మికులకు పంపిణీ**
>
> **అండర్‌గ్రౌండ్ ఉద్యోగులకు మస్టర్‌కు రూ.576.32.. సర్ఫేస్ ఉద్యోగులకు రూ.456.24**
>
> **సర్ఫేసు ఉద్యోగులకు మస్టర్‌కు రూ.421.15.. కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్**

- కార్మిక సంఘాల వరుస డిమాండ్లు..

సింగరేణిలో ప్రతి ఏడాది చెల్లించే లాభాల వాటా శాతాన్ని త్వరగా ప్రకటించాలని గత నాలుగైదు నెలలుగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. సంస్థ సాధించిన లాభాలను వెల్లడించి, కార్మికులకు చెల్లించే వాటా శాతాన్ని ప్రకటించాలని ఉద్యోగులు కోరారు. గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీతోపాటు హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ తదితర సంఘాలు ఈ అంశాన్ని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాయి. కార్మికుల శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నందున వారికి మరింత మెరుగైన వాటా అందించాలని సంఘాల నాయకులు కోరుతూ వచ్చారు.

- గత ఏడాది కూడా 34 శాతమే..

2024-25 ఆర్థిక సంవత్సరానికి కూడా సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటాను ప్రకటించారు. ఈసారి కూడా అదే 34 శాతాన్ని కొనసాగించడంతో లాభాల వాటా శాతంలో ఎలాంటి పెంపు చోటుచేసుకోలేదు. కార్మిక సంఘాలు మాత్రం సంస్థ లాభాలు, కార్మికుల శ్రమను పరిగణనలోకి తీసుకొని వాటా శాతాన్ని పెంచాలని కోరాయి. కొన్ని సంఘాలు 35 శాతం ఇవ్వాలని, మరికొన్ని 40 శాతం, ఇంకొన్ని 50 శాతం వరకు లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశాయి. అయితే ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన శాతాన్నే ఈసారి కూడా కొనసాగించింది.

- ఖర్చులు మినహాయించిన లాభాల్లో వాటా..

సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో నుంచి సంస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చులు, ఇతర వ్యయాలను మినహాయించిన అనంతరం లాభాల వాటా కేటాయింపును పరిగణనలోకి తీసుకొని కార్మికులకు 34 శాతం వాటా చెల్లించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. సంస్థ ఆర్థిక ఫలితాలను పరిగణనలోకి తీసుకొని కార్మికులకు వాటా కేటాయించినట్లు వెల్లడించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా అందించడం ద్వారా వారి శ్రమకు గుర్తింపు లభించనుంది.

- అండర్‌గ్రౌండ్ ఉద్యోగులకు మస్టర్‌కు రూ.576.32..

సింగరేణి యాజమాన్యం లాభాల వాటాను ఉద్యోగులు పనిచేసిన మస్టర్ల ఆధారంగా లెక్కించి చెల్లించనుంది. వివరాల ప్రకారం, అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒక్కో మస్టర్‌కు రూ.576.32 చొప్పున లెక్కించనున్నారు. సర్ఫేస్ విభాగాలతోపాటు సీహెచ్‌పీ, ఎస్టీపీపీ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒక్కో మస్టర్‌కు రూ.456.24 చొప్పున చెల్లించనున్నారు. అదేవిధంగా ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒక్కో మస్టర్‌కు రూ.421.15 చొప్పున లెక్కించనున్నారు.

- ఒరిజినల్ అటెండెన్స్ ఆధారంగా బ్యాంకు ఖాతాల్లో జమ..

ఉద్యోగులు విధులకు హాజరైన ఒరిజినల్ అటెండెన్స్ మస్టర్లను ప్రామాణికంగా తీసుకొని లాభాల వాటాను లెక్కించనున్నారు. ఆయా విభాగాల్లో పనిచేసిన మస్టర్ల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో ఉద్యోగికి అందాల్సిన మొత్తాన్ని గణించి, వారి బ్యాంకు ఖాతాల్లో సింగరేణి యాజమాన్యం జమ చేయనుంది. దీంతో ఉద్యోగుల హాజరు, పనిచేసిన మస్టర్ల సంఖ్య ఆధారంగా ఒక్కొక్కరికి అందే మొత్తం మారనుంది.

ఈ లెక్కింపు విధానం ద్వారా ఉద్యోగులు తమకు అందే లాభాల వాటాను అంచనా వేసుకునే అవకాశం ఉంటుంది.

- రూ.595 కోట్ల పంపిణీపై ఆసక్తి..

సింగరేణి సంస్థ ఆర్జించిన సుమారు రూ.1,750 కోట్ల లాభాల్లో 34 శాతం వాటా కింద రూ.595 కోట్లను కార్మికులకు పంపిణీ చేయనుండటం కీలక అంశంగా నిలుస్తోంది. సంస్థ అభివృద్ధిలో కార్మికుల శ్రమ, అంకితభావం కీలక పాత్ర పోషిస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తి, రవాణా, యంత్రాల నిర్వహణ, ఇతర అనుబంధ కార్యకలాపాల్లో ఉద్యోగులు అందిస్తున్న సేవలు సంస్థ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో లాభాల వాటా రూపంలో పెద్ద మొత్తాన్ని పంపిణీ చేయనుండటంతో ఉద్యోగులు తమకు అందే మొత్తంపై ఆసక్తి చూపుతున్నారు.

- బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు చేరకపోవడంతో లాభాలు తగ్గాయి..

లాభాల వాటా ప్రకటన సందర్భంగా సింగరేణి సంస్థ అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోవడంతో లాభాలు తగ్గాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. అయినప్పటికీ కార్మికులకు 34 శాతం లాభాల వాటాను ప్రకటిస్తున్నట్లు తెలిపారు . సంస్థ ఆర్థిక పరిస్థితులు, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలు లాభాలపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈసారి కూడా అదే శాతాన్ని కొనసాగించినట్లు తెలిపారు.

- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్..

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పించింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి ఒక్కో కాంట్రాక్టు కార్మికుడికి రూ.5,500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికులు కూడా బొగ్గు ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తున్న నేపథ్యంలో వారికి బోనస్ అందించాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. దసరా పండుగ సందర్భంగా ఈ నగదు అందితే కార్మిక కుటుంబాలకు అదనపు ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

- చెల్లింపుల తేదీ ఖరారు కావాల్సిందే..

సింగరేణి లాభాల వాటా ప్రకటన కోసం ఉద్యోగులు, కార్మిక సంఘాలు కొంతకాలంగా ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వం అధికారికంగా 34 శాతం వాటాను ప్రకటించడంతో ఆ నిరీక్షణకు తెరపడింది. ఒక్కో ఉద్యోగికి రూ.1,53,912 చొప్పున వాటా అందనున్నట్లు ప్రకటించడం, కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటించడం కార్మిక వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే లాభాల వాటా, బోనస్ నగదు పంపిణీకి సంబంధించిన ఖచ్చితమైన తేదీని సింగరేణి యాజమాన్యం ప్రకటించాల్సి ఉంది. బ్యాంకు ఖాతాల్లో నగదు ఎప్పుడు జమ అవుతుందనే అంశంపై కార్మికుల్లో ఆసక్తి

## మనసును వినాలి.. మార్పును తేవాలి...!

- పోటీ పరీక్షల అభ్యర్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం
- పరీక్షల ఒత్తిడిని అధిగమించాలి.. ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవాలి
- టీపీఏ మంచిర్యాల జిల్లా శాఖ ప్రతినిధులు






**మంచిర్యాల, 13, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత నిస్తూ, పరీక్షల ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) మంచిర్యాల జిల్లా శాఖ ప్రతినిధులు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం--2026 సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న పద్మనాయక ఏసీ హాల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, భావోద్వేగ సమతుల్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. మనసును వినాలి.. మార్పును తేవాలన్నారు . ఈ సందేశంతో నిర్వహించిన కార్యక్రమంలో మానసిక ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకోవడం, బాధలో ఉన్నవారి మాటలను శ్రద్ధగా వినడం, వారి అనుభవాలకు ప్రాధాన్యతనివ్వడం, అవసరమైన సమయంలో తగిన సహాయం అందించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. 2026 ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ సందేశమైన “హాఉజవం జుఇజూవతీఅవఅఎవం, నముతీఃఎ =ముశ్రీ ఎశీఅఎవం, =ముశ్రీ జష్ట్రుఅస్త్రవ” ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలను అనుభవించిన వ్యక్తుల గొంతులను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వాటి ఆధారంగా సేవల్లో సానుకూల మార్పులు తీసుకురావడం ఎంత ముఖ్యమో వివరించారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పరీక్షల ఒత్తిడి, ఫలితాలపై ఆందోళన, మార్కులు, ర్యాంకులపై భయం, కుటుంబ సభ్యుల అంచనాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ సాధనలో ఎదురయ్యే సవాళ్ల కారణంగా మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడానికి సమయపాలన పాటించడం, చదువుతోపాటు తగిన విశ్రాంతి తీసుకోవడం, భావోద్వేగాలను సమతుల్యం చేసుకోవడం, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి అలవాట్లను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పరీక్షే జీవితం కాదు.. మానసిక ప్రశాంతత ముఖ్యం అన్నారు . “పరీక్ష మీ లక్ష్యం కావచ్చు.. మీ జీవితానికి అది ఒక్కటే నిర్వచనం కాదు” అనే సందేశాన్ని ప్రతి అభ్యర్థి గుర్తుంచుకోవాలని తెలిపారు. పరీక్షల్లో విజయం సాధించడం ముఖ్యమే అయినప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం కూడా అంతే ముఖ్యమని వివరించారు. వైఫల్యాలను జీవితంలో ఒక భాగంగా స్వీకరిస్తూ, వాటి నుంచి పాఠాలు నేర్చుకొని, నిరంతర కృషితో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

కౌన్సెలింగ్ తీసుకోవడం బలహీనత కాదు ఆందోళన, నిరాశ, తీవ్రమైన ఒత్తిడి వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు అర్హత కలిగిన మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం పొందాలని సూచించారు. కౌన్సెలింగ్ తీసుకోవడం బలహీనత కాదని, అది ఆరోగ్యం పట్ల బాధ్యతాయుతమైన నిర్ణయమని స్పష్టం చేశారు. మానసిక ఆరోగ్యంపై సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంలో కుటుంబాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంస్థలు, సమాజంలోని అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమతోపాటు ఇతరులకు కూడా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని, అవసరమైన సమయంలో సంకోచం లేకుండా అర్హత కలిగిన నిపుణుల సహాయం పొందుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. తమ మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు ఇతరుల భావోద్వేగాలను గౌరవించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ సుమన చైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నారాయణరావు, టీపీఏ సలహాదారు, కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత కస్తూరి పద్మ చరణ్, గుండేటి యోగేశ్వర్, విన్నర్ ఐకాన్ కాంపిటేటివ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధన, సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ప్రధాన లక్ష్యం

- ఆర్‌కే--5 గనిపై ఘనంగా ‘శ్రమశక్తి -విజయబాట’ గేట్ మీటింగ్

**మంచిర్యాల, 13, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే--5 గనిపై ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ‘శ్రమశక్తి--విజయబాట’ కార్యక్రమంలో భాగంగా గేట్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. గని పిట్ కార్యదర్శి కొత్తూరు నంబయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు పేరం రమేష్, కలవేణి శ్యామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ల్యాగల శ్రీనివాస్ ఆర్‌కే--5 గనిని సందర్శించారు. నూతన ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కు గని కార్మికులు, యూనియన్ నాయకులు ఘనస్వాగతం పలికారు.

## 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు

### వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి

గద్వాల అక్టోబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లావ్యాప్తంగా వెట్టిచాకిరీ నిర్మూలనపై కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు





అన్నారు.మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు,ఇతర అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వెట్టిచాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు,అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343ను విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతుందని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి,బాధితులను గుర్తించి,వారికి విముక్తి కల్పించడంతోపాటు అవసరమైన సహాయం,పునరావాసం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని,ఎలాంటి ఒత్తిడి,బెదిరింపులు లేదా శ్రమదోపిడీకి గురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.వెట్టిచాకిరీ ఘటనలను హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్,డీడబ్ల్యూఓ సునంద,డీఈఓ విజయలక్ష్మి,కళాకారులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ట పాలు చేయడమే కాంగ్రెస్ నైజం..

**ఓటమి భయంతోనే ఓటు చోరీ డ్రామాలు!**

**ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్ దాడిఎన్నికల్లో వరుస ఓటములతో దేశ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ..**

ఆలంపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
గద్వాల పట్టణంలోని మంగళవారం డికె.బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్. ఐ ఆర్. ప్రక్రియపై



రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం వారి రాజకీయ దివాళా కొరకే నిదర్శనం అని అన్నారు.. అదేవిధంగా సుప్రీంకోర్టు తీర్పును కూడా గౌరవించరా? అని ఎస్. ఐ ఆర్ . ప్రక్రియ అంతా చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని మే 27, 2026 న సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టే ఈ ప్రక్రియ చెల్లుబాటు అవుతుందని చెప్పిన తర్వాత కూడా, కాంగ్రెస్ పార్టీ ఇంకా అబద్ధాలను ప్రచారం చేయడం అంటే న్యాయవ్యవస్థను సైతం అవమానించడమే అవుతుందని అన్నారు. అదేవిధంగా.కాంగ్రెస్ పార్టీకి ఒక రాష్ట్రంలో ఒక నీతి, ఢిల్లీలో ఒక నీతి ఉంటుందా? కేరళలో వారి సొంత హోంమంత్రే ఎస్ ఐ. ఆర్. ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు మరియు అక్రమ ఓటర్లను తొలగించడానికి వీలవుతుంది" అని అంగీకరించారు. అలాగే తెలంగాణ, కర్ణాటక, కేరళ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే వ్యవస్థ ద్వారా ఎన్నికలు జరిగితే ఒప్పుకుంటారు.. కానీ వారు ఓడిపోయే రాష్ట్రాల్లో మాత్రం ఎన్నికల సంఘంపై నిందలు వేస్తారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అని అన్నారు.. . అదేవిధంగా అక్రమ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎందుకు ఉలిక్కిపడుతోందని దేశ భద్రతకు ముప్పుగా మారిన అక్రమ చొరబాటుదారుల ఓట్లను, బోగస్ ఓట్లను తొలగించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఎందుకంటే ఆ బోగస్ ఓట్లే వారి రాజకీయా ధారం. నిజమైన ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా, బూత్ లెవల్ అధికారులు నేరుగా ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్లు సేకరిస్తారని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇంత పారదర్శకమైన ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోవాలని చూస్తోంది అని ప్రశ్నించారు. అలాగే తెలంగాణలో ఈ ప్రక్రియను విజయవంతం కాకుండా చూసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు, ఎన్నికల సంఘానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు.. అదేవిధంగా దేశవ్యాప్తంగా 124 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సరు చట్టబద్ధ ప్రక్రియలో పాలుపంచుకుంటూ ఓటర్ల జాబితా శుద్ధీకరణను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. అన్నారు కావున ఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించే ఈ మంచి ప్రక్రియను తప్పుబడుతూ, కాంగ్రెస్ నేతలు ఇది తప్పు ప్రక్రియ అని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు, ఇంటలెక్చువల్స్ అందరూ ఈ సరు ప్రక్రియ మంచిదేనని చెబుతుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం తమ అనవసర ఆలోచనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాబట్టి, కాంగ్రెస్ నేతలు వెంటనే తమ తప్పుడు ప్రచారాలను మానుకోవాలని, ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న ఈ మంచి ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు ఆపాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్, రాష్ట్రమహిళా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా యువమోర్చ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిల మోర్చా అధ్యక్షురాలు సమత మధుగౌడ్ ,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మహిళా మోర్చా నాయకురాలు కుంటల మాధవి, భారతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంజి సైకిల్ స్టోర్ యజమాని మహమ్మద్ గౌస్ మృతి

నాగర్ కర్నూల్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):
నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యా పారి ఎం.జి సైకిల్ స్టోర్ యజమాని



మహమ్మద్ గౌస్(72) మృతి చెందారు.కొంతకాలంగా అనారో గ్యంతో చికిత్స పొందుతు మంగళవారం తుదిశ్వాస వదిలారు.వ్యాపార రంగంలో అంచలంచేలుగా ఎదుగుతూ మంచి పేరును సంపాదించుకున్న గౌ స్ కు ముస్లిం మైనారిటీ సంఘాలు,జర్నల్ మర్చం ట్ అసోసియేషన్ బాధ్యులు మహమ్మద్ గౌస్ మృ తి పట్ల ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

# కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనకు గడ్కరీకి ఆహ్వానం

### రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయండి

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి వినతి

నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( ప్రజా జ్యోతి బ్యూరో)
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతంచేయడంతో పాటు, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి ఊతమిచ్చేలా కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపన



కార్క్రమ◌ానికి రావాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు.

**హైబ్రిడ్ బ్రిడ్జితో రెండు రాష్ట్రాల అనుసంధానం బలోపేతం:**

జాతీయ రహదారి 167కేపై కృష్ణా నదిపై నిర్మించనున్న హైబ్రిడ్ కేబుల్-స్టేయిడ్, సస్పెన్షన్ తరహా ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరగా.. కేంద్ర మంత్రి గడ్కరీ అంగీకారం తెలిపారు.
ఈ వంతెన నిర్మాణంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర అనుసంధానం మెరుగుపడటంతోపాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి మధ్య 80 కి.మీ ప్రయాణ దూరం తగ్గి, సుమారు 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు.

**సోమశిల ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక శోభ:**

ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఈ వంతెన నిర్మాణం దోహదపడుతుందని, స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల.. ఆధ్యాత్మిక, పర్యాటక హబ్ గా వృద్ధి చెంది, తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని తెలిపారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్‌వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిల.. ప్రకృతి పర్యాటకానికి విశేష అవకాశాలున్న ప్రాంతం. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని, బోటింగ్, పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు స్థానికంగా హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా



అభివృద్ధి చేసేందుకు మెరుగైన రహదారి అనుసంధానం కీలకం కానుందని మంత్రులు వివరించారు.

**జాతీయ రహదారిగా మార్చండి:**

రాష్ట్రంలో సుమారు 225 కి.మీ. మేర ప్రతిపాదించిన రహదారి మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని మంత్రులు కోరారు. పుల్లూరు (ఎన్‌హెచ్-44) నుంచి ఆలంపూర్-జటప్రోలు- పెంట్లవెల్లి - కొల్లాపూర్- లింగాల-అచ్చంపేట- డిండి (ఎన్‌హెచ్-765) - దేవరకొండ (ఎన్‌హెచ్-167) - మల్లేపల్లి మీదుగా నల్గొండ (ఎన్‌హెచ్-565) వరకు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేయగా.. నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.ఈ రహదారి అభివృద్ధితో ఇప్పటికే ఉన్న జాతీయ రహదారులతో అనుసంధానం మెరుగుపడటంతోపాటు ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గుతాయని వారు వివరించారు.
వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్య సేవలను సులభతరం కావడంతోపాటు పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్:**

హైదరాబాద్-శ్రీశైలం ఎన్ హెచ్ -765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి చేసిన విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.
ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డి పి ఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గడ్కరీని కలిసిన వారిలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ ( ఎం ఓ ఆర్ టి హెచ్ ) అధికారులు, రాష్ట్ర అధికారులు ఉన్నారు.

## బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి:రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్

**వేడుకల ఫొటోలు,వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి**

**సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా అవగాహన కల్పించాలి**

**పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేయాలి.. రెండు వారాల్లో డీపీఆర్ బాధ్యతలు అప్పగించాలి**

గద్వాల అక్టోబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):
తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణ,పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ,ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు ఐడీఓసీ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాణీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు,పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.మహిళలు,యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం,తాగునీరు, విద్యుత్ దీపాలు,రవాణా,పార్కింగ్,భద్రత వంటి సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి ప్రచారం కల్పించాలని సూచించారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు,బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం,నీటి లభ్యత,వ్యవసాయం,పర్యావరణంపై పడే ప్రభావాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించి,నీటి సంరక్షణ,పర్యావరణ పరిరక్షణ,నీటి పొదుపు వంటి అంశాలను పాటల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందు



కోసం మహిళా సంఘాలు, యువత,ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు.బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా,ప్రజలకు ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలకు వేదికగా మలచాలని సూచించారు.

**పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి:**

రాష్ట్రవ్యాప్తంగా 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు వాణీ ప్రసాద్ తెలిపారు.ఈ ప్రాజెక్టులను స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పనుల బాధ్యతలను సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు అప్పగించి,నిర్మాణాల నాణ్యత,పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.పర్యాటక ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.ప్రతి



జిల్లాలో రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలను సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు.అవసరమైన చోట కన్సల్టెన్సీ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.డీపీఆర్‌లలో ప్రాజెక్టు పరిధి,భూమి లభ్యత, నిర్మాణ పనులు,మౌలిక సదుపాయాలు,అంచనా వ్యయం,నిధుల సమీకరణ,అమలు గడువు వంటి అంశాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

**హరిత హోటళ్ల పూర్తికి ప్రైవేట్ పెట్టుబడులు:**

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులు పూర్తి చేసి,నిర్దిష్ట కాలానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ఇందుకు ఆసక్తి చూపే పెట్టుబడిదారులను జిల్లా స్థాయిలో గుర్తించి, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి,సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు,ఆధ్యాత్మిక క్షేత్రాలు,ప్రకృతి అందాలు,వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి,మౌలిక సదుపాయాలు,అంచనా వ్యయం, అమలు విధానం,పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు.

**పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం:**

పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు,కేంద్ర ప్రభుత్వ పథకాలు,స్వచ్ఛంద సంస్థల సహకారం,ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని వాణీ ప్రసాద్ సూచించారు.స్వదేశ్ దర్శన్ పథకం కింద జిల్లాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధుల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.పర్యాటక ప్రాంతాల్లో రహదారులు,తాగునీరు,విద్యుత్,పారిశుధ్యం,మరుగుదొడ్లు,పార్కింగ్, వసతి,సమాచార బోర్డులు,భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.స్థానిక కళలు,హస్త కళలు,స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు,స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతోపాటు,సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలలో 3వరోజు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వరాహావతారం

### -ఆలయ పురవీధులలో వైభవంగా స్వామివారికి కల్పవృక్ష వాహన సేవ

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):
నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని బ్రాహ్మణవాడలో అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 61వ వార్షిక



బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. 3వ రోజు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు వంశి జోషి తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకం కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి హారతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాలలో 3వ రోజు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారు వరాహవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్పవృక్ష వాహనంపై భక్తుల గోవింద నామాలు స్మరిస్తూ మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చిన్నారులచే నృత్య ప్రదర్శన నిర్వహించారు. కలియుగ కల్పతరువైన ఆ వేంకటేశ్వర స్వామి స్వామి ముందు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అందరిని కనివిందు చేసింది. భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ జోషి మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 61వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారు ప్రతిరోజు ఒక్కొక్క



అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని కావున మఖ్తల్ పట్టణవాసులు స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బ్రాహ్మణులు,మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్థివదేహాలకు నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

ఆలంపూర్ అక్టోబర్ 12( జ్యోతి డివిజన్ ప్రతినిధి):
గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం అల్లపాడు గ్రామంలో బిఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచు ప్రతాప్ అత్త తుమ్మలబావి లక్ష్మీ మరియు గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఆలూరు ప్రకాష్ గౌడ్ తండ్రి ఆలూరు తిమ్మప్ప గౌడ్ మరియు గద్వాల పట్టణంలోని కుంటవీధి కాలనీలో టీచర్ కుంటల కామాక్షి అనారోగ్యములతో మృతి చెందారు విషయం తెలుసుకొని వారి స్వగృహాలకి వెళ్లి, వారి ప్రార్థివదేహా



లకు పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు..వీరి వెంట,రాజారెడ్డి,సర్పంచు సౌరప్ప, శ్రీనివాస్ గౌడ్,సి.కె.రంగన్న,చక్రిధర్ రెడ్డి,నరసప్ప, వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి,కుంట సాలన్న, జాంపల్లి భరత్ సింహారెడ్డి, సిద్ది భాయ్ కిష్టన్న,కురవ లచ్చన్న,నాగరాజు, తిమ్మప్ప, రాము,రాముడు, మల్లికార్జున్, నరసింహులు,గోవిందు, వీరేష్ మరియు నాయకులు తదితరులు ఉన్నారు.

# గుండ్రపల్లి చెరువు కట్టపై... ప్రయాణికుల అవస్థలు

– దారి గుంతల మయం... విస్తరణ ఎప్పుడంటూ ప్రజల ఆగ్రహం



**నెక్కొండ అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** నెక్కొండ మండలం గుండ్రపల్లి చెరువు కట్టపై మంగళవారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరుకుగా ఉన్న ఈ రోడ్డుపై లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా రావడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపో యాయి. దారిలేక ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి బస్సు ప్రయాణికులు, స్థానిక గ్రామస్తులే స్వయంగా రంగంలోకి దిగి డ్రైవర్లకు సర్దిచెప్పి, ట్రాఫిక్ క్లియర్ చేయాల్సి వచ్చింది. నిత్యం రద్దీగా ఉండే ఈ చెరువు కట్ట రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. నెక్కొండ వయా పెదకూరపాడు కేసముద్రం వైపు వెళ్లే ఈ చిన్న దారిలో లారీలు, బస్సులు రాకపోకలు సాగించడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఉదయాన్నే పాఠశాలకు వెళ్లే స్కూల్ బస్సులు, చిన్నపిల్లల ఆటోలు ఈ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని నానా తంటాలు పడుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ దారిలో గుంతలు ఏర్పడి బురదమయంగా మారుతుం దని, ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ చెరువు కట్ట రోడ్డును వెంటనే వెడల్పు పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# సినీ గేయ రచయిత డాక్టర్ కందికొండ జయంతి వేడుకలు



**నర్సంపేట, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు నాగుర్లపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ కందికొండ యాదగిరి పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్, మండల బీజేపీ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, మాజీ ఎంపీటీసీ మచ్చిక నరసయ్య పాల్గొని డాక్టర్ కందికొండ యాదగిరిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందికొండ ఇంటర్ చదివే రోజుల్లో సంగీత దర్శకుడు చక్రి తో పరిచయం ఏర్పడింది.మొదటిసారిగా జానపద గీతాలు రాసిన కందికొండ చక్రి సన్నిధ్యంతో సినిమా సాహిత్యం వైపు మొగ్గు చూపారు.తొలిసారి చక్రి సంగీత దర్శకత్వం వహించిన ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం చిత్రంలో మళ్లీ కూయవే గువ్వా అనే పాట రచనతో సినిమాలో అడిగి పెట్టారు.దర్శకుడు జగన్నాథ్ వరుస అవకాశాలతో పాటలు రాసి గేయ రచయితగా నిలదొక్కుకున్నారు. కందికొండ సినిరంగంలో అడుగుపెట్టిన నాటి నుండి12 ఏళ్లు సినీ ప్రస్థానంలో 1000 కి పైగా పాటలు రాశారు.తెలంగాణ నేపథ్యంలో ఎన్నో జానపదాలు బతుకమ్మ పాటలు రచించారు. ఈ కార్యక్రమంలో కందికొండ శ్రీధర్,ముప్పారపు గణేష్, పోలెబోయిన అశోక్, నల్ల మహేందర్, పెరుమల్ల చిన్న, కట్టస్వామి, తనుగుల సుధాకర్, జవాజి కుమారస్వామి,ఇల్లందుల భాస్కర్, కొర్ర పృథ్వీరాజ్, బానోత్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని పంట పొలాల్లో రోడ్డు పనులు..

భూ నిర్వాసిత రైతుల ఆగ్రహం..





**పరకాల, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** పరకాల మండలంలోని పోచారం--వెల్లంపల్లి గ్రామాల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనుల నేపథ్యంలో భూ నిర్వాసిత రైతులకు, సంబంధిత అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పెండింగ్‌లో ఉన్న భూముల్లో రోడ్డు పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారి అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి అక్కడికి చేరుకోవడంతో రైతులు తమ నిరసన వ్యక్తం చేశారు. తమ భూములకు సరైన పరిహారం అందించకుండా రోడ్డు పనులు ఎలా చేపడతారని రైతులు అధికారులను ప్రశ్నించారు. పంట చేతికొచ్చే సమయంలో పొలాల్లో పనులు చేపట్టడం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా పచ్చని పంట పొలాల్లో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులకు పంట నష్టపరిహారం అందిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం పంటలను తొలగించి రోడ్డు పనులను ప్రారంభించారు. రైతులు పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నప్పటికీ పనులు కొనసాగించడంపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

భూములకు సంబంధించిన పరిహారం, పంట నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తమకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని భూ నిర్వాసిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి సతీష్ బాబు ఆర్డిఓ వెంకన్న ఎమ్మార్వో విజయలక్ష్మి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక ధర్మశాల అభివృద్ధికి కృషి చేయాలి

ధర్మశాల పరిసరాల్లో భాజపా నాయకుల స్వచ్ఛ కార్యక్రమం



**హసన్‌పర్తి, అక్టోబరు 13 (ప్రజాజ్యోతి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా హసన్‌పర్తిలోని చారిత్రక ధర్మశాల వద్ద మంగళవారం శుభ్రత కార్యక్రమం చేపట్టారు. భాజపా మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, 66వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సుమారు 65 ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని నాయకులు, కార్యకర్తలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ.. గతంలో స్థానికులు ఆటలు ఆడుకోవడానికి, యోగా సాధన చేయడానికి, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఉపయోగపడిన ధర్మశాల ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చారిత్రక ధర్మశాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి, స్థానికులు యోగా, వ్యాయామం, ఆటలు ఆడుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర మండలి సభ్యుడు మారుపెల్లి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వరరావు, ఎర్రగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, దాసరి రాజు, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు ఇమ్మడి కరుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి చెల్పూరి శంకర్, కార్యదర్శి దాది మధుసూధన్, ఆర్మీ శ్రీనివాస్, గొర్రె కుమార్, ఎస్టీ రాజు, కంబర్కర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా జరగాలి





– నిబంధనల ప్రకారం అర్హత ప్రమాణాలు పాటించాలి

– కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..

**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం చేపట్టారు. ఈ క్రమంలో హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. గుండ్లసింగారం-3 కు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో, జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ, మొత్తం 19 పోస్టులకు 953 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులు వేగవంతం చేయాలి





– నాలా విస్తరణ, భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి..

– కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** భద్రకాళి చెరువు వరద నీటి అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశిం చారు. మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, నాలా విస్తరణ పనులను నిర్దేశిత సమయంలోగా చేపట్టాలని సూచించారు. హనుమకొండలోని కాపువాడలో భద్రకాళి చెరువు కట్ట వద్ద చేపట్టిన నాలా విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, ఇంకా పూర్తికావాల్సిన భూసేకరణ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భద్రకాళి చెరువు వరద నీటి అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణానికి సంబంధించిన పనుల్లో జాప్యం జరగ కుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలా విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేశ్, మున్సి పల్ ఎస్ఈ రాజ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రాంప్రసాద్, ఈఈ రవికుమార్, సీపీ రవీంద్ర రెడేకర్, ఈఈ కిరణ్‌కుమార్, డీఈ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# భద్రకాళి రథోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..

– రథోత్సవానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి..

– తెప్పోత్సవానికి తాత్కాలిక నీటి కొలను ఏర్పాటు చేయాలి.. – కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** భద్రకాళి దేవాలయంలో రథోత్సవ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న ఉత్సవ రథం పనుల పురోగతిని సమీక్షించి, రథోత్సవాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ కార్యనిర్వహణాధికారి సునీతను రథోత్సవ ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ రథం సజావుగా తిరిగేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భద్రకాళి చెరువులో తగినంత నీరు అందుబాటులో లేనందున తెప్పోత్సవ నిర్వహణ కోసం తాత్కాలికంగా నీటి కొలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాంప్రసాద్‌తో పాటు సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం భద్రకాళి తాగునీటి జలాశయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రకాళి తాగునీటి జలాశయానికి దేవాదుల ప్రాజెక్టు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్‌కుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ బీఎల్ఏలకు అవగాహన..

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్..



**పరకాల, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. బీఎల్ఏలు తమకు కేటాయించిన బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలను సేకరించాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు కోసం ఫారం-18ను సరైన విధంగా నింపే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# చంద్రఘంటదేవి అవతారంలో అమ్మవారు



**పరకాల అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** పరకాల పట్టణం లోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు చంద్రఘంట దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.వేద పండితులు మణిదీప్ శర్మ చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం తక్కలపల్లి గీత-రాజు దంపతుల సారథ్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, రాజేష్ గంగు, కృపేందర్ రెడ్డి, నిఖిల్, సాయి, వర ప్రసాద్, రాకేష్, రాజేంద్రప్రసాద్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా హోదాపై బహిరంగ చర్చకు సిద్ధం

బీజేపీ నాయకుడు ఆకుల శ్రీధర్ సవాల్



**పరకాల, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి) :** బీఆర్ఎస్ నాయకులు బీజేపీని విమర్శించే ముందు పదేళ్ల పాలనలో పరకాలకు జిల్లా హోదా ఎందుకు కల్పించలేకపోయారో సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆకుల శ్రీధర్ డిమాండ్ చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం పొందిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల ప్రజల ఆకాంక్షను ఎందుకు నెరవేర్చలేకపోయారని ప్రశ్నించారు. పరకాల జిల్లా హోదా, ఆసుపత్రి, విద్యా సదుపాయాలు, రహదారుల అభివృద్ధిపై ఆధారాలతో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు తేదీ, సమయం, స్థలం ప్రకటించి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పరకాలకు అమరవీరుల జిల్లాగా గుర్తింపు సాధించే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.

# గోదావరి జలాలతో చెరువును నింపాలి

గ్రంథాలయ చైర్మన్ రాంబాబుకు కోదూరు కాంగ్రెస్ నాయకులు వినతి



**రఘునాథపల్లి, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి) :** రఘునాథపల్లి మండలంలోని కోదూరు గ్రామ పెద్ద చెరువును గోదావరి జలాలతో నింపేందుకు చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబును కోదూరు గ్రామ నాయకులు కోరారు. మంగళవారం రఘునాథపల్లి మండల కేంద్రం లోని రాంబాబు నివాసంలో గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువును గోదావరి జలాలతో నింపడం ద్వారా గ్రామంలో నీటి వసతి మెరుగుపడటంతోపాటు రైతులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వారు కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారం తో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చెరువును నింపేందుకు కృషి చేయాలని రాంబాబును విజ్ఞప్తి చేశారు.ఈ విషయం పై సానుకూలంగా స్పందించిన రాంబాబు 15 రోజులలో చెరువును నింపుతనని హామీ ఇచ్చిన్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోడిశాల లలిత – సోమయ్య,మాజీ సర్పంచ్ జోగు గట్టయ్య, మాజీ ఎంపీటీసీ గొరిగే భాస్కర్,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పూజారి మల్లయ్య, ఉపసర్పంచ్ శాగంటి యాదగిరి, వార్డు సభ్యులు కాడె వీరేష్, శాగంటి సోమయ్య, గొరిగే చిన్న యాదయ్య, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల పిల్లల స్కాలర్‌షిప్ దరఖాస్తులపై అవగాహన

ఆలేరు అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి): బీడీ కార్మికుల పిల్లలకు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ పథకాలపై అవగాహన కల్పించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వెల్ఫేర్ కమిషనర్ రీగా సింగ్ చౌహాన్, ఆలేరు బీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల, ఫార్మసీ ఆఫీసర్ రాజేష్, ఆలేరు మండల



సిఎస్సి ప్రొప్రైటర్ పటేల్ వంశీ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.స్కాలర్‌షిప్ దరఖాస్తులపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందేలా ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. అర్హత కలిగిన బీడీ కార్మికుల కుటుంబాలు దరఖాస్తు ప్రక్రియపై సరైన సమాచారం తెలుసుకొని, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా బీడీ కార్మికుల కుటుంబాల్లో విద్యా అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేశారు.

## ఐలమ్మ విగ్రహానీ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### ఐ ఎన్ టి యు సి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్

ఆలేరు అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి): మెదక్ పట్టణ కేంద్రంలో ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంస చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల స్టడీ రాష్ట్ర కన్వీనర్ ఐ





ఎన్ టి యు సి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా కేంద్రంలో వెల్కం బోర్డు దగ్గర గత నాలుగు సంవత్సరాల క్రితం వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఆవిష్కరణ చేసిన విషయం తెలిసిందే మెదక్ రజక కులస్తులు చాకలి ఐలమ్మకు సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో రజకులు చైతన్యవంతులై అయితున్నారని కొంతమంది అగ్రకుల అహంకారులు సహించలేక అక్టోబర్ 12 సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేయడం అంటే రజక కులస్తులపై దాడి చేయడమే అని ఆవేదన వ్యక్తం చేశారు ఇంకా ఈ సమాజంలో దొరల దుహంకారం అగ్రకుల అహంకారం రాజమేలుతున్నారని చెప్పడానికి సిగ్గుపడుతున్నామని పేర్కొన్నారు.

## నిలువు దోపిడీ చేస్తున్న కుశాల్ హోండా

### ఆలేరులో సర్వీస్ సెంటర్ యజమాన్యం

ఆలేరు అక్టోబర్ 13( ప్రజా జ్యోతి)






యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న కుషాలు ఉన్న సర్వీస్ సెంటర్ యజమాన్యం కస్టమర్ల దగ్గర సర్వీసింగ్ కోసం వెళ్తే నిరు దోపిడీ చేస్తున్నారని వినియోదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి రిపేరు చేయకుండా కేవలం ఆయిల్ చేంజ్ చేసి వాటర్ సర్వీసింగ్ చేసి దండిగా డబ్బులు దండుకుంటున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. కావున చిట్టి సర్వీస్ సెంటర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుని కస్టమర్లకు న్యాయం జరిగే విధంగా చేయాలని ప్రభుత్వాన్ని తదితర అధికారులను విజ్ఞప్తి చేస్తున్నామని వినియోగదారుడు ఆలేరు మున్సిపాలిటీకి చెందిన ఆరో వార్డు బహదూర్ పేట గొర్ల కాపరి సంఘం అధ్యక్షులు వట్టిపల్లి లక్ష్మణ్ విలేకరులకు సమాచారం ఇచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఉపేందర్ రెడ్డి

ఆలేరు అక్టోబర్ 13( ప్రజా జ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం లోని కొల్లూరు గ్రామానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేరు పిఎసిఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# చివ్వెంల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలి: గ్రామీణ పేదల సంఘం డిమాండ్

చివ్వెంల అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే





ఆదుకోవాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు.సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని ఎండిపోయిన పంట పొలాలను సంఘం జిల్లా నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య మాట్లాడుతూ గత మూడు నెలలుగా సరైన వర్షాలు కురవకపోవడంతో చెరువులు,కుంటలు,బోరుబావులు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీరు,సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడిందన్నారు.వర్షాభావ పరిస్థితులు రైతుల వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.జూలై నెలలో కురిసిన అరకొర వర్షాలను నమ్ముకుని రైతులు పత్తి, పెసర, కంది తదితర పంటలను సాగు చేశారని,ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు పంటలు చేతికందక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి చివ్వెంల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి బాధిత రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నాయకులు భాషీపంగు సునీల్, అనంతుల ఎల్లయ్య, అంజయ్య, నారాయణరెడ్డి, షేక్ సైదులు, ధరావత్ వీరన్న, కట్టంగూరు వెంకటరావు, పంతం బ్రహ్మచారి, భూక్య వెంకన్న, భూక్య చక్రం, భూక్య పెద్దవల్యా, సిగ వెంకన్న, చిన్నవల్యా తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయంలి

### డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర అనిల్ కుమార్

ఆలేరు అక్టోబర్ 13( ప్రజా జ్యోతి): భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆలేరు మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి మోరిగాడి



పృధ్వి అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 24 ,25 26 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఈ రాష్ట్ర మహాసభలలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పన వంటి సమస్యలపై చర్చించి, యువజన ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించడంలో రాష్ట్ర మహాసభలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువతను ఐక్యం చేసి, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు దిశానిర్దేశం చేసేందుకు ఈ మహాసభలు తోడ్పడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్షుడు వ్యాపార ప్రసాద్, మహావీర్, నాగరాజు రాజకుమార్ కార్తీక్ కళ్యాణ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

## ఆలేరులో చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశం విజయవంతం

ఆలేరు, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి): ఆలేరు హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం విజయవంతంగా జరిగింది. సంఘం నూతన పాలకవర్గం చైర్మన్ దాసి





శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి చేనేత సహకార సంఘం సభ్యులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం, సభ్యుల సమస్యలు, చేనేత రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. చేనేత కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు సంఘం పాలకవర్గం కృషి చేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.అనంతరం చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్, హ్యాట్రిక్ విజయాలు సాధించిన నాయకుడు చింతకింది వెంకటేశ్వర్లు ఆరో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. చేనేత రంగానికి, సహకార సంఘానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి జౌలీశాఖ ఏడిఓ సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సమావేశంలో ఆలేరు మున్సిపల్ కో ఆప్షన్ మెంబెర్ చింతకింది మురళి చేనేత వైస్ చైర్మన్ చింతకింది రంగా, కార్యదర్శి గాడిపెల్లి రమేష్, కోశాధికారి ఎలగందుల ఉమారుషి, సహాయ కార్యదర్శి బింగి నర్సింహులు, డైరెక్టర్స్ అంకం మల్లేశం, అందె రాములు, ఎలగందుల పద్మ, బేతి భాగ్య, మాజీ కార్యదర్శి ఎలగందుల రామారుషి, మాజీ ఉపాధ్యక్షులు సామల రామనర్సయ్య, పద్మశాలి మండల అధ్యక్షులు సామల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కర్రె ఎల్లయ్య,పద్మసుదర్శన్, చింతకింది సత్యనారాయణ, చింతకింది రామానుజం, ఎలగందుల లక్ష్మి నారాయణ, రేగోటి వెంకటేష్ చింతకింది సిద్దులు,చింతకింది వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు,సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వల్లాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

నల్లగొండ అక్టోబర్ 13 ( ప్రజా జ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని శ్రీ



పార్వతీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శివ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో 16వ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు దేవాలయంలో కొలువైన అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ శివ సాయి రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక



పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఆధ్వర్యంలో అన్నప్రసాదం గ్రామస్థులకు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్నర్స్ కన్మంతరెడ్డి కేశవరెడ్డి, దోనూరి సత్తిరెడ్డి నర్సిరెడ్డి, ఆలయ పూజారి వావిలాల రామలింగ శర్మ, గ్రామ సర్పంచ్ భూపతి తిరుపతమ్మ-ఉపేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రాగి దావీదు, మాజీ సర్పంచ్ భూపతి మంగమ్మ వెంకన్న గౌడ్, మాజీ ఎంపీటీసీ మాధగోని కవిత రామలింగయ్య , శివ దుర్గా కమిటీ సభ్యులు, భవానీ మాలలు ధరించిన భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు

అనంతగిరి,అక్టోబర్ 13(ప్రజాజ్యోతి ) అనంతగిరి మండల పరిధిలోని రఘునాథ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహానికి నిర్వహించిన పూజా



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. గ్రామ దేవతల పూజలు ప్రజల్లో ఐక్యతను, సామాజిక సమగ్రతను పెంపొందిస్తాయని అన్నారు. అమ్మవారి కృపతో గ్రామంలో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మన సంప్రదాయ పండుగలను తరతరాలుగా కొనసాగించడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దుర్గమ్మ ఉత్సవాల ఏర్పాట్లలో కృషి చేసిన గ్రామ పెద్దలు, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవతో చాటిన ఉపసర్పంచ్

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి): మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ



కార్మికులకు వస్త్ర కానుకలను పంపిణీ చేశారు. గ్రామ పారిశుధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న కార్మికులను గౌరవిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిపల్లి పంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాలు

### సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఉదారత

దేవరకొండ, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్, పది మంది వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "అందరూ బాగుండాలి.. అందరితో నేను ఉండాలి"



అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పండుగ వేళ అందరిలో ఆనందాన్ని పంచుకోవడం, పరస్పర స్నేహభావంతో ముందుకు సాగడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్ రెడ్డి, ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు ఎర్ర మహేశ్వరి, కత్తుల రమేష్, గోలి స్వామి, దారం సైదమ్మ, బోడ నాగరాజు, ఎర్ర వంశీకృష్ణ, గణపురం రాధిక, వట్టేపు శ్రీను, వడ్లపల్లి శ్రావణ్యతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది గోలి ఈశ్వర్, వడ్లపల్లి వెంకటరెడ్డి, భూతం యాదయ్య, కొమ్ము దుర్గయ్య, ఎర్ర వెంకటయ్య, బోడ వెంకటయ్య, గణపురం ముత్యాలు పాల్గొన్నారు.

## బీఎస్ఏ జాతీయ అవార్డుకు వంగపల్లి రమేష్ కుమార్ ఎంపిక

నల్లగొండ అక్టోబర్ 13:( ప్రజా జ్యోతి ప్రతినిధి): శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు వంగపల్లి రమేష్ కుమార్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బహుజన






సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నారు.

కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అందించిన సేవలతో పాటు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు రమేష్ కుమార్ తెలిపారు. ఢిల్లీలో నవంబర్ 15న నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ సదస్సులో ఆయన ఈ జాతీయ అవార్డును అందుకోనున్నారు.

## అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

నల్లగొండ అక్టోబర్ 13: (ప్రజా జ్యోతి ప్రతినిధి ):



శాలిగౌరారం మండలం తిరుమలరాయని గూడెం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా చాడ రమేష్ రెడ్డి–ఝాన్సీ, చాడ సురేష్ రెడ్డి–కవిత దంపతులు వ్యవహరించారు. అలాగే స్వాములు వడ్లకొండ సతీష్, అరవింద్, విక్రమ్, శివ, నాగరాజు, నవీన్, తేజ పాల్గొన్నారు.

# కోనాపూర్‌లో ఘనంగా సామూహిక కుంకుమార్చన

★ 50 మంది మహిళలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి ) అక్టోబర్ 12 :** జై దుర్గా భవానీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోనాపూర్ గ్రామంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు మునుగోటి కృష్ణకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చిలివేరి లక్ష్మీ నారాయణ, పొలాస అంజయ్య, టేకుల సంజీవ్, గంగుల లక్ష్మీ నారాయణ, బెజ్జారపు పరమేష్,



గంగుల దేవేందర్, కట్టేకోల రాజేష్, ఏలేటి నర్సారెడ్డి, మారంపల్లి ధనుంజయ్, చెక్కిళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సామూహిక కుంకుమార్చన కార్యక్రమం భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

# కోటాలపల్లిలో పంట పొలాలను పరిశీలించిన ఏఈఓ శ్రీనివాస్ రెడ్డి

★ పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ అధికారి
★ రైతులకు అందుబాటులో ఉంటూ సాగు వివరాలను తెలుసుకున్న అధికారులు



**కామారెడ్డి రూరల్, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలం కోటాలపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖకు చెందిన ఏఈఓ శ్రీనివాస్ రెడ్డి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని వివిధ పంటల సాగు పరిస్థితులను పరిశీలిస్తూ పంటల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలను దగ్గరుండి పరిశీలించి వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు అందుబాటులో ఉండటం, పంటల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వ్యవసాయానికి సంబంధించిన అవసరమైన సూచనలు అందించేందుకు అవకాశం ఉంటుంది. గ్రామంలో పంట పొలాల పరిశీలన కార్యక్రమంలో కోటాలపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల శ్యామ్ కుమార్ పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. రైతుల సంక్షేమం, పంటల అభివృద్ధికి క్షేత్రస్థాయి పరిశీలనలు దోహదపడతాయని గ్రామస్థులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

★ తక్షణమే ఉద్యగాల భర్తీకై నోటిఫికేషన్స్ వేయాలి ★ ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**నిజామాబాదు అర్బన్ ప్రజాజ్యోతి అక్టోబర్ 13:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని, తక్షణమే ఉద్యోగాల భర్తీకై నోటిఫికెషన్స్ వేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. మంగళవారం రోజున భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిజామాబాద్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈసమావేశం కి ముఖ్య అతిధిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ తో పాటు





ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు.సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇవ్వాలని,స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు.దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలి. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో 60 లక్షల పైగా ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేయాలని,నిరుద్యోగ యువతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చంద్రకాంత్, సర్దార్, ఆజమ్, రాజు,రవీందర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తడపాకల్లో ఘనంగా కిశోర బాలికల ఆటపాటలు, బతుకమ్మ సంబరాలు

★ కిశోర బాలికల సంఘాల్లో ప్రతి బాలిక తప్పనిసరిగా చేరాలి ★ ఐకెపి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నీలిమ

**ప్రజాజ్యోతి, ఏర్గట్ల, అక్టోబర్ 13:** 14 నుంచి 18 సంవత్సరాల లోపు వయసున్న బాలికలందరూ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కిశోర బాలికల సంఘాల్లో తప్పనిసరిగా చేరాలని ఐకెపి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నీలిమ సూచించారు. మంగళవారం ఏర్గట్ల మండలంలోని తడపాకల్లో నిర్వహించిన కిశోర బాలికల ఆటపాటలు, బతుకమ్మ సంబరాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం కిశోర బాలికల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారి రక్షణ, ఆరోగ్యం, వ్యక్తిగత అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలు, వృత్తి విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సంఘాల ఏర్పాటును గత వేసవిలో ప్రారంభించిందని నీలిమ తెలిపారు. ఈ సంఘాల ద్వారా బాలికలకు అవసరమైన సూచనలు, సలహాలు అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ప్రస్తుతం పాఠశాలలకు దసరా సెలవులు ఉండటంతో కిశోర బాలికల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని





తెలిపారు. ఇందులో భాగంగా 'ఆటపాటలు, బతుకమ్మ' కార్యక్రమాన్ని బాలికల ఆధ్వర్యంలో నిర్వహించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను వారికి వివరించినట్లు చెప్పారు.బతుకమ్మ పండుగలో గునుగు పూలు, తంగేడు పూలు వంటి ప్రకృతిలో సహజంగా లభించే పూలను ఉపయోగించడం ప్రత్యేకత అని నీలిమ వివరించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించాలని, ఐకమత్యంతో ముందుకు సాగాలని, అందరూ సమానమేననే గొప్ప సందేశాన్ని బతుకమ్మ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు బాలికల్లో ఐక్యతాభావాన్ని, సామాజిక స్పృహను పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం కిశోర బాలికలకు వాలీబాల్, కుర్చీ పరుగు తదితర పోటీలను నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం బతుకమ్మ సంబరాల్లో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్, ఐకెపి ఏపీఎం కుంట గంగాధర్, సీసీ రవికుమార్, గ్రామ సంస్థ సహాయకులు, గ్రామ సమాఖ్య పాలకవర్గ సభ్యులు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



## ఆమిర్ అలీ ఖాన్‌ను ఎమ్మెల్సీగా పునరుద్ధరించాలని

# ముస్లిం నాయకులు ముఖ్యమంత్రిని గట్టిగా డిమాండ్

**జహీరాబాద్, అక్టోబర్ 13 ( ప్రజా జ్యోతి న్యూస్ )** హజ్ కమిటీ మాజీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్ ఒక పత్రికా ప్రకటనలో, న్యాయ పరమైన వివాదాల కారణంగా నిలిచిపోయిన ఆమిర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీ పదవిని పునరుద్ధరించి, ఆయనను నామినేట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డిని గట్టిగా డిమాండ్ చేశారు. రాజకీయ వ్యవస్థకు ఆమిర్ అలీ ఖాన్ చేసిన సేవలు మరువలేని వని అన్నారు. 'సియాసత్' వార్తాపత్రిక సంపాద కుడైన ఆమిర్ అలీ ఖాన్ ఒక చైతన్యవంత మైన నాయ కుడని, ఆయనకు దేశభక్తి ఉందని, ఎమ్మెల్సీగా తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీల సమస్యలను ధైర్యంగా లేవనెత్తా రని, కానీ దేశ శత్రువులైన కొందరు వ్యక్తుల కుట్రల కారణంగా, ఆ ఎమ్మెల్సీని న్యాయపర మైన వివాదాల్లోకి లాగి అనర్హుడిగా ప్రకటించారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఆమిర్ అలీ ఖాన్, 'సియాసత్' వార్తా పత్రిక కీలక పాత్ర పోషించా యని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా చైతన్య ఉద్యమం ప్రారంభించామని, అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించిన పార్టీతో రాజీపడి





ముస్లింలకు ఎలాంటి మద్దతు ఇవ్వలేదని అన్నారు. సమస్యల పై నిస్వార్థ సేవ చేసిన ఆమిర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకుండా,అదే ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌ను నామినేట్ చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయిందని, కానీ రేవంత్ రెడ్డి శాసన మండలిలో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గించ బడిందని, దీని కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ముస్లిం మైనారిటీలలో అసంతృప్తి ఉందని మాజీ హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసఫ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాలతో పాటు ముస్లిం సమాజానికి కూడా మంత్రివర్గంలో ఎప్పుడూ ప్రాతినిధ్యం ఉండేదని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు పూర్తి అన్యాయం చేస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు.

# మూడవ రోజు శ్రీ గాయత్రీదేవిగా ముమ్మాదేవి అమ్మవారు

★ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**రాయికోడ్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ముమ్మాదేవి అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.




# రైతులకు మెరుగైన విద్యుత్ సరఫర

★ సోలక్‌పల్లిలో 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
★ పంట పొలాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్న విద్యుత్ అధికారులు

**జిన్నారం (ప్రజాజ్యోతి)** రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు, ఇందులో భాగంగా మంగళవారం జిన్నారం మండలం సోలక్‌పల్లి గ్రామంలోని పంట పొలాలను పటాన్‌చెరు విద్యుత్ డివిజన్ అధికారి భాస్కరరావు, గుమ్మడిదల ఏఈడీఈ దుర్గాప్రసాద్ సందర్శించారు. గ్రామంలోని బోరుబావుల వద్దకు వెళ్లి రైతులతో సమావేశమయ్యారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఏ విధంగా అందుతోంది, ఏవైనా అంతరాయాలు ఎదురవుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడం వల్ల పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో చర్చించారు.

**యాసంగి పంటలకు మెరుగైన సరఫరా**

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సోలక్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని భాస్కరరావు రైతులకు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, యాసంగి పంటల సాగుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో లేదా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయాలు ఏర్పడితే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం





అందించాలని అధికారులు రైతులకు సూచించారు. వినియోగదారులు, రైతులతో విద్యుత్ సిబ్బంది మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ తుకారాం, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మల్లేష్, రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**మునిపల్లి అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల కింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ కుమార్,మాజీ ఎంపీపీ రాంరెడ్డి,తహశీల్దార్ రంగారావు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే సర్వశుభాలు

● పాల్వంచ సబిత శ్రీదర్ గౌడ్ దంపతులు



**కొల్చారం,అక్టోబర్ 13( ప్రజా జ్యోతి)** ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ శుభాలు కలుగుతాయని పాల్వంచ సబిత శ్రీదర్ గౌడ్ దంపతులు అన్నారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ సబిత శ్రీదర్ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ ప్రథమ శిష్యుడు నారాయణ శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తల్లి రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దంపతులు అమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ గౌడ్, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, రామాగౌడ్, లక్ష్మీ నారాయణ గౌడ్, కృష్ణ గౌడ్ (కిట్టు), సంజీవ్ రావు, సుధాకర్ గౌడ్, పాపగౌడ్, శివకుమార్ గౌడ్, శివ గౌడ్, రేగల్ల రితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● వెంటనే నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి ● మెదక్ సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్



**అక్టోబర్ 13 మెదక్ బ్యూరో ప్రజా జ్యోతి:** మెదక్ వెల్కమ్ బోర్డు దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.మంగళవారం మెదక్ లో తెల్లవారు జామున చాకలి ఐలమ్మ విగ్రహం విరిగి ముక్కలుగా పడి ఉండడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. చాకలి ఐలమ్మ విగ్రహం దగ్గర పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కులదోసిన వారిని గుర్తించి ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇదే విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులను అడగగా కోతలు విగ్రహాన్ని విరగగొట్టాయని చెబుతున్నారు.ఒకవేళ కోతులే విరగగొడితే పక్కనే ఉన్న బతుకమ్మ ను కోతులు ఏమిచేయలేదు."మరి ఐలమ్మ"విగ్రహాన్ని ఎలా పడేస్తాయని వారు ప్రశ్నించారు. విగ్రహాన్ని కోతులు ఊపి పడేసేంత బలహీనంగా విగ్రహం లేదని ఆమెఅన్నారు. విగ్రహం ఎలా కూలి పోయిందనేది ప్రభుత్వం వెంటనేపరిశీలించి ఒకవేళ మనుషులైతే కఠినంగా శిక్షించాలని,కొత్త విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని పార్టీ జిల్లా కమిటి తరపున డిమాండ్ చేస్తున్నామని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మల్లేశం, పార్టీ సభ్యులు రెడ్డి,వెంకట్ పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం దెబ్బతినడానికి కోతులే కారణం

● సీసీ కెమెరాల దృశ్యాల పరిశీలన.. ప్రత్యక్ష సాక్షుల ద్వారా నిర్ధారణ
● మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్



**అక్టోబర్ 13 మెదక్ జిల్లా బ్యూరో ప్రజా జ్యోతి :** మంగళవారం తెల్లవారు జామున సుమారు 4:30 గంటల సమయం లో మెదక్ పట్టణంలోని వెల్కమ్ బోర్డు వద్ద ఉన్న సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం కోతులు పట్టుకొని ఊగడం వల్ల దెబ్బతిన్నట్లు విచారణలో వెల్లడైందని మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ తెలిపారు.విగ్రహం దెబ్బతిన్న విషయం పోలీసుల దృష్టికి వచ్చిన వెంటనే ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను సేకరించి పరిశీలించడంతో పాటు, ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఇద్దరుమహిళల నుంచి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. సీసీకెమెరాలదృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వివరాలను పరిశీలించిన అనంతరం విగ్రహం దెబ్బతినడానికి కోతులే కారణమని నిర్ధారణకు వచ్చినట్లు మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ వెల్లడించారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లిలో బతుకమ్మ సంబరాలు







**ములుగు, అక్టోబర్13 (ప్రజాజ్యోతి)** ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి సాంప్రదాయాలను పాటించడంలో ప్రజలు ముందుంటారని, ఇందులో భాగంగా శనివారం నుండి ప్రారంభమైన బతుకమ్మ సంబరాల్లో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామంలో మహిళలందరూ ఒకే రంగు చీరలు ధరించి బతకమ్మ సంబరాల లో పాల్గొని విజయవంతం చేయడం సంతోషం కలిగించిందని,ఈ బతుకమ్మ ఆటలలో పాల్గొన్న ఆడపడుచులు పోటీ పడుతూ బతుకమ్మ ఆడుతూ పాటలను పాడుతూ బతకమ్మ పండగకే వన్నె తెచ్చారని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సాయి రెడ్డి మహిళలను అభినందించారు.రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఈసారి బతుకమ్మ పండుగను నిర్వహించి కొత్త వరవడికి నాది పలికామని,నాగిరెడ్డిపల్లి గ్రామానికి సౌండ్ బాక్స్ ను అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ రోటరీ 3150 చైర్మన్లు కొడాలి చంటి,కర్ణాకర్ రెడ్డి,జగదీశ్వర్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి,సందు గారి నరసింహారెడ్డి,స్థానిక సర్పంచ్ కవిత,ఉప సర్పంచ్ పుష్పలత, రోటరీ సభ్యులు సంతోష్ కుమార్, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్ గౌడ్, నరసింహులు గౌడ్, బాల్రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ సాహితీ సమావేశానికి
## తెలుగు ఉపాధ్యాయుడు జక్కుల శ్రీనివాస్‌కు ఆహ్వానం



**కొమురవెల్లి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):-** బక్రీచెప్యాల గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌కు ప్రపంచ సాహితీ సమావేశంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న ప్రపంచ సాహితీ సమావేశానికి ఆయనకు ఆహ్వానం అందడం విశేషం. జక్కుల శ్రీనివాస్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్)లో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే వచన కవిగా సాహితీ రంగంలో తనదైన గుర్తింపు పొందుతున్న ఆయనకు ఈ ఆహ్వానం అందడం పట్ల సంతోషం వ్యక్తమవుతోంది. ప్రపంచ సాహితీ సమావేశానికి ఆహ్వానం అందడం అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు జక్కుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమేష్‌తో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. జక్కుల శ్రీనివాస్‌కు అభినందనలు తెలియజేశారు.

# భవిష్యత్తులో నీటి కొరత

● ప్రత్యామ్నాయ పంటలకు కార్యాచరణ చేపట్టాలి
● కలెక్టర్ ప్రతిమా సింగ్



**అక్టోబర్ 13 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి:** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తనాల సరఫరా, వ్యవసాయ, విద్యుత్తు, మంచినీటి తదితర రంగాలపై ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. పంటల సాగులో వైవిధ్యీకరణ ద్వారా తక్కువ నీటి వినియోగంతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలన్నారు.వరి సాగు వల్ల కలిగే లాభనష్టాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మద్దతు ధరలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పంటల విత్తనాలకు సంబంధించి సబ్సిడీ వివరాలతో కూడిన సమగ్ర ప్రొఫార్మాను సిద్ధం చేయాలన్నారు. మండలాలు, గ్రామాల వారీగా రైతుల నుంచి విత్తనాల డిమాండ్‌ను సేకరించి, అవసరమైన విత్తనాల కొరకు ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రాబోయే రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలతో నివేదికలు అందించాలన్నారు. వ్యవసాయ శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తూ అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏయే పంటలను కొనుగోలు చేస్తారు, వాటికి వర్తించే మద్దతు ధరలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంతో పాటు నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వేసవిలో.మంచినీటి సమస్య రాకుండా సమ్మర్ యాక్షన్ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. రబీ సాగు కంటే ముందునుండే పంటల సాగుపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్తు, మున్సిపల్ కమిషనర్, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, నీటిపారుదల డివిజన్ల ఈఈలు జిల్లా పంచాయతీ డి ఎల్ పి ఓ లు , తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు

● ప్రజాసేవ, వృత్తిపరమైన నిబద్ధతపై సిబ్బందికి పోటీలు



**అక్టోబర్ 13 మెదక్ జిల్లా బ్యూరో ప్రజా జ్యోతి** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ సిబ్బందిలో ప్రజాసేవ పట్ల బాధ్యత, వృత్తిపరమైన నిబద్ధత, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై అవగాహన పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,తెలిపారు.కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు పనిచేస్తున్న సిబ్బందికి "ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు", "పోలీస్ అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర -- దానిదుర్వినియోగాన్ని నివారిస్తూ వ్యక్తిగత, సామాజికప్రయోజనాలకు సద్వినియోగం చేసుకోవడం ఎలా?" అనే రెండు అంశాలను కేటాయించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ వ్యాసాలను సమర్పించారు.ప్రజల పట్ల పోలీసుల బాధ్యతలు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల పాత్ర, సోషల్ మీడియాను సమాజ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని ఈ పోటీలు ప్రతిబింబిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.అదేవిధంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ విద్యా స్థాయికి అనుగుణంగా నిర్దేశించిన అంశాల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు.పోలీస్ అమరవీరుల త్యాగాలనుస్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ పోటీలు పోలీస్ సిబ్బంది, విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని తెలిపారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

● విద్యారంగంలో సేవలకు గుర్తింపుగా టీచర్ అవార్డు



**కొండపాక, అక్టోబర్ 13: (ప్రజా జ్యోతి)** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరెల్లి శ్రీనివాస రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. 'గురువందనం--2026 ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్' కార్యక్రమానికి ఆయన ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఘనంగా సన్మానం అందుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్సీ పాల్ రాజేశ్వర్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా శ్రీనివాస రెడ్డి సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులుగం దామోదర్ రెడ్డి, పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కుకునూరుపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఈ గౌరవం లభించడంపై స్థానిక విద్యావర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



## బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

● బూరం అభినవ్, ప్రిన్సిపాల్, రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్




**నంగునూర్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):-** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బూరం అభినవ్ అన్నారు. రాజగోపాలపేట లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ బూరం అభినవ్ మాట్లాడుతూ, ప్రకృతిని పూలతో పూజించే సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళా సిబ్బంది, విద్యార్థినులు కలిసి బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ బద్ధంగా వేడుకలను నిర్వహించి పండుగ విశిష్టతను చాటి చెప్పారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు సయ్యద్ షాహబాజ్, పాతూరి శ్రీనివాస రెడ్డి, వై.రాజు, ఏవో రాజేశ్ మహిళా సిబ్బంది కవిత, జ్యోతి, దీపిక, మంజుల, వాణి, బాల మణి, లావణ్య, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## బందారం మల్లన్న దేవాలయంలో చోరీ

● 60 వేల విలువగల ఆభరణాల చోరీ



**కొండపాక అక్టోబరు 13 (ప్రజా జ్యోతి):-** కొండపాక మండలం బందారం గ్రామం లో గల మల్లన్న దేవాలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాలకు వెళ్లిన వారికి దేవాలయం డోరు తీసి ఉండడం గమనించి చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఏసిపి రవీందర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అలాగే క్లూస్ టీం చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. దేవాలయంలోని బంగారు, వెండి ఆభరణాలను దుండగులు చోరీచేసుకునినట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు అరవై వేల రూపాయల విలువగల వస్తువులు చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు డిస్కంతో ఉచిత విద్యుత్‌కు ముప్పు!

● జీఓ 17తో రైతులకు నష్టమే
ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పట్టింపేదీ?
● బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్




**దౌల్తాబాద్,అక్టోబర్ 13 ( ప్రజా జ్యోతి ):** రైతు డిస్కం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 17 పై బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ మండిపడ్డారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం. కొత్త డిస్కం ఏర్పాటుతో ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పట్టించుకునే నాథుడే లేరని, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త డిస్కం ఏర్పాటు చేస్తే రైతుల కష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని రహీమొద్దీన్ పేర్కొన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సింది పోయి, కొత్త విధానాలతో మరిన్ని సమస్యలు సృష్టించడం సరికాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు సకాలంలో మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్ పథకం యథావిధిగా కొనసాగుతుందనే భరోసాను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేసేలా ఉండాలే తప్ప, వారి మీద అదనపు భారం మోపేలా ఉండకూడదని రహీమొద్దీన్ అన్నారు. జీఓ 17 అమలుతో ఉచిత విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వృత్తివిద్యా కోర్సులే విద్యార్థులకు భవిష్యత్తునిస్తాయి

**– ఒకేషనల్ కోర్సులతో అనేక ఉపాధి అవకాశాలు**
**– ఆదర్శ పాఠశాల, కళాశాల ఒకేషనల్ ట్రైనర్ సుష్మ క్రాంతి**




**తాండూరు అక్టోబర్ 13 ప్రజాజ్యోతి :** తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అందిస్తున్న ఒకేషనల్ కోర్సులో భాగంగా ఒకేషనల్ ట్రైనర్ సుష్మ క్రాంతి నేతృతంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్, హార్డ్ వేర్ అంశాలపై తాండూరు పట్టణంలోని ఆరాధ్య ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ నందు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఒకేషనల్ ట్రైనర్ సుష్మ క్రాంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఐనెల్లి గ్రామ సమీపంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదేశాల మేరకు వృత్తి విద్య (ఒకేషనల్ ఎడ్యుకేషన్)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యాను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ పై పూర్తిస్థాయి పరిజ్ఞానం పెంపొందించుకోవడం కోసం దసరా సెలవులలో పది రోజుల పాటు ఇంటర్న్ షిప్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు నివ్వడంతో పాటు వృత్తివిద్య కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు రానున్న రోజులలో అనేక ఉపాధి అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## అధునాతన న్యూరో రోబోటిక్ వ్యవస్థ ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** హైదరాబాద్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో రోసా వన్ బ్రెయిన్ న్యూరో రోబోటిక్ సిస్టమ్‌ను ప్రారంభించినట్లు ఆసుపత్రి వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ గురు ఎన్.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రిలో 500 రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తయిన సందర్భంగా జిఈ రూపొందించిన సిగ్న హీరో 3.0టి బ్రెయిన్ ఎంఆర్ఐ వ్యవస్థను కూడా ఆవిష్కరించినట్లు తెలిపారు. రోసా వన్ బ్రెయిన్ మెదడు శస్త్రచికిత్సల్లో పరికరాలను ఖచ్చితంగా నిర్దేశించేందుకు, 3టి ఎంఆర్ఐ మెదడు వ్యాధులను అధిక స్పష్టతతో గుర్తించేందుకు సహాయ పడతాయని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూరోసర్జన్లు డాక్టర్ హృషికేశ్ సర్కార్, డాక్టర్ శివానంద్ రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ రేడియాలజిస్ట్, ఐఆర్ఐఎ తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సుధీర్ పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో ఘనంగా రుద్రం రంగ్ రాస్ (ఆర్ ఆర్ ఆర్) దాండియా గర్భ ఉత్సవ్





**ఉప్పల్, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన (ఆర్ ఆర్ ఆర్ ) రుద్రం రంగ్ రాస్ దాండియా గర్భ ఉత్సవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భం గా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దాండియా ఉత్సవాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి కార్యక్రమాలు యువతలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్, సందీప్, సల్ల ప్రభాకర్, భాస్కర్, బాపిరెడ్డి, ప్రశాంత్, బాబీ, రఘు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**
**– మైలార్దేవుపల్లి డివిషన్‌లో 178 లక్షల నిధులతో సిసి రోడ్లు, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి అభివృద్ధి చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవుపల్లి డివిషన్‌లో 178 లక్షల నిధులతో సిసి రోడ్లు, పార్కు అభివృద్ధి పనులకు మంగళవారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లోనూ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. మొదటగా సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లను వేసి అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఇంకా డివిజన్లలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,అంచనాలు వేస్తే అంచలంచలుగా అభివృద్ధి చేయడానికి నిత్యం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# వికారాబాద్ జిల్లాతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**పరిగి, తాండూరు, వికారాబాద్ ప్రాంతాల అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం: ముకుంద నాగేశ్వర్**



**పరిగి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రజలకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరలేదని తెలంగాణ ఉద్యమ నాయకులు, బీజేపీ నాయకులు ముకుంద నాగేశ్వర్ విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయన ఆరోపించారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ ప్రాంతానికి అధికంగా నిధులు కేటాయిస్తున్నారని, పరిగి, తాండూరు, వికారాబాద్ ప్రాంతాలకు తగినన్ని నిధులు కేటాయించడం లేదని విమర్శించారు.

జీవో నంబర్ 317 వికారాబాద్ జిల్లా నిరుద్యోగులు, యువతకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రాణహిత--చేవెళ్ల, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా జిల్లాలోని ఒక్క ఎకరానికీ సాగునీరు అందలేదని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా భవిష్యత్తులోనైనా నీరు అందుతుందనే నమ్మకం ప్రజల్లో కలగడం లేదని పేర్కొన్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసం పరిగిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు కంకల్, దిర్సంపల్లి--దాదాపూర్, మరికల్, వెన్నచేడ్, తట్టేపల్లి వంటి ప్రాంతాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పరిగిలో 2015, 2022 సంవత్సరాల్లో శంకుస్థాపన చేసిన రైతుబజార్, నమూనా కూరగాయలు, మాంసాహార మార్కెట్ల భవనాల పనులు పూర్తి కాలేదని తెలిపారు. పరిగిలో నూతన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయలేదని, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా పరిగిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, తాండూరులో కంది బోర్డు, స్టోన్ క్రషింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి పనులు 2019 నాటికే పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటికీ కొనసాగుతున్నాయని, అవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. 2018లో ప్రారంభమైన లక్నాపూర్ ప్రాజెక్టు సుందరీకరణ, పూడికతీత పనులు కూడా ఇంకా పూర్తికాలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలోనైనా జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కొడంగల్‌కు కేటాయిస్తున్న నిధుల్లో కనీసం పది శాతం కూడా పరిగి, తాండూరు, వికారాబాద్ ప్రాంతాలకు కేటాయించడం లేదని ఆయన ఆరోపించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై సరైన అవగాహనతో పనిచేసే నాయకత్వం అవసరమని పేర్కొన్న ముకుంద నాగేశ్వర్, భవిష్యత్తులో ప్రజలు నూతన ఉద్యమ నాయకత్వాన్ని చట్టసభలకు పంపాలని కోరారు.

# జనగణనలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

**- పారదర్శకంగా, గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి - అదనపు కలెక్టర్ వెంకటాచారి**






**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** జనగణన – 2027 ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి అధికారులకు సూచించారు. జనగణనలో సేకరించే వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన రెండో దశకు సంబంధించి ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసే జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొదటి దశ ఇంటి జాబితా తయారీ ప్రక్రియలో భాగంగా 2,028 ఇంటి జాబితా బ్లాకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో 1,600 మంది ఎన్యూమరేటర్లు, 271 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

శిక్షణలో భాగంగా జనగణన రెండో దశ విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ, సాంకేతిక సాధనాల వినియోగం, డేటా నమోదు, సమాచార గోప్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ప్రణాళిక శాఖ రిటైర్డ్ డైరెక్టర్ దయానంద్, ఏడీ రవిచంద్ర, శిక్షణాధికారి జంగయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.72 లక్షల నిధులతో రామంతాపూర్ నేతాజీ నగర్, రాజేంద్రనగర్ శ్మశాన వాటికల అభివృద్ధి





**ఉప్పల్, అక్టోబర్ 14, (ప్రజాజ్యోతి) :** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషితో రామంతాపూర్‌లోని నేతాజీ నగర్, రాజేంద్రనగర్ శ్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.72 లక్షల నిధులు మంజూరయ్యాయి.

మంగళవారం రామంతాపూర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

అభ్యర్థ న పై సానుకూలంగా స్పందించిన కమిషనర్ వెంటనే రూ.72 లక్షల నిధులను మంజూరు చేయడంతో పాటు, టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నే రామంతాపూర్ నేతాజీనగర్ రాజేంద్ర నగర్ శ్మశాన వాటిక ల్లో అభివృద్ధి పనులు జరిగాయని గత 10 సంవత్సరాలు గా ఈ స్మశాన వాటికలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు,ప్రస్తుతం పూర్తి స్థాయి అభివృద్ధి కోసం ఎంఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి రూ.72 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు.ఈ సందర్భం గా రామంతాపూర్ కాంగ్రెస్ నాయకులు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కి, పరమేశ్వర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్, రఫిక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉదయ్ భాస్కర్ గంగపుత్ర, పూస సత్తి అన్న, షాగా శ్రీధర్, సచిన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో బ్రిడ్జి పనులు వేగవంతం.!

**- వాహనదారులకు రాకపోకల సమస్య తీరనుంది**
**- మరో నెలలో ప్రజలకు అందుబాటులోకి బ్రిడ్జి - ఉప్పరిగూడ పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి**







**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 13 ప్రజాజ్యోతి :** ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో శ్రీఇందు కాలేజీ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పాండురంగారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, శేరిగూడ శ్రీఇందు కాలేజీ వద్ద మొదలైన బ్రిడ్జి పనులు, నిధుల కొరతతో నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నిలిచిపోయిన బ్రిడ్జి పనులకు నిధులు కేటాయించి, వేగవంతంగా పనులు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. హైదరాబాద్ నాగార్జునసాగర్ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంగా, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముందుగా ఒక లైన్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి గత సంవత్సరం క్రితం అందుబాటులోకి తీసుకువచ్చారు. మరొక్క లైన్ బ్రిడ్జి పనులో స్లాబ్ పూర్తి కావడం జరిగిందని, మరో నెలలో ఈ యొక్క బ్రిడ్జి పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని రెండు కళ్ళలా భావిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**– ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి**
**– తాండూర్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్**



**తాండూరు అక్టోబర్ 13 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు డిపో పరిధిలోని వివిధ గ్రామాలకు అందిస్తున్న ఆర్టీసీ సేవలపై నేడు డయల్ యువర్ డిఎం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తాండూరు డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు బస్సు రవాణా సౌకర్యంలో ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా మాట్లాడే అవకాశం కల్పించామని చెప్పారు. ముఖ్యంగా డయల్ యువర్ డిఎం కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సెల్ నెంబరు 9063469572 కు స్వయంగా ఫోన్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది

**సర్పంచ్ కె.సుశీల**



**మోమిన్పేట్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** సోమవారం నాడు మోమిన్పేట్ మండల పరిధిలోని మేకవనం పల్లి గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడాతు గ్రామాల్లో అర్హులైన వారందరికి రేషన్ కార్డులను పంపిణీ చేయ డానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆమె అన్నారు. మండల పరిధిలోని చక్రం పల్లి గ్రామంలో సర్పంచ్ బాల్రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు సుగుణ. విక్రమ్ రెడ్డి. జిపిఓలు అలివేలు. ప్రభాకర్ డీలర్ శశికల. పాండు. కారోబార్ నాగయ్య. శేఖర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ ఆలయంలో అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు



**బోయిన్ పల్లి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** శ్రీ దేవి శరన్న వరాత్రి మహోత్సవాల్లో భాగంగా న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని శ్రీ దేవి నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి వివిధ విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి తమ వంతు విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు.మూడవ రోజు అన్నదాన కార్యక్రమానికి అనూ గీత, హారిత, శీలం వెంకటేష్, ప్రేమ్ ముదిరాజ్, రామారావు, పుట్టి నర్సింహ, అజిత్ కళ్యాణ్, మారుతి గౌడ్, శ్రీకాంత్, బాబురాజు గౌడ్, మహేష్ కుమార్, భరత్వాజ్, శేఖర్, శేఖర్ గౌడ్ తదితరులు దాతలుగా సహకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం

**బతుకమ్మ నిమజ్జనాలకు ఏర్పాట్లు..**
**విజయదశమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు:**
**చైర్‌పర్సన్ రజిత వెంకటేష్**



**పరిగి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మతో పాటు నవరాత్రి, విజయ దశమి ఉత్సవాలను పట్టణ ప్రజలందరూ ఘనంగా నిర్వహించుకో వాలని పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి, పూజలు నిర్వహిస్తూ మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ గురువారం నిర్వహించనున్న బతుకమ్మ పండుగ సందర్భంగా పరిగి పట్టణంలోని కొత్తకుంట చెరువులో బతుకమ్మ నిమజ్జనాల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా రానున్న విజయద శమి వేడుకలను పురస్కరించుకొని ఆలయాల వద్ద అవస రమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ధ్వజారోహణం, రావణ దహనం తదితర కార్యక్రమాల నిర్వహణకు హిందూ ఉత్సవ సమితి సమన్వయంతో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని మహిళలు, ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆమె కోరారు. దుర్గామాత ఆశీస్సులతో పరిగి పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం ?

ఎండపల్లి, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి:
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో గ్రామ ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి కొమరయ్య కు చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది.





విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా అడ్డుకోగలిగారు. ఈ ఘటనలో బంగారు ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు సహా పలు వస్తువులు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. అగ్నిప్రమాదం కారణంగా సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని బాధితుల అంచనా? ఆస్తి విలువపై అంచనా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది కాగా ప్రమాదంలో నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# జర్నలిస్టుకు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆర్థిక భరోసా

## తోటి జర్నలిస్ట్ చికిత్సకు రూ.20 వేల సాయం అందజేత

మెట్‌పల్లి, అక్టోబర్ 12,ప్రజా జ్యోతి:
తోటి జర్నలిస్టు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు మానవత్వంతో స్పందించారు. తమ సహచరుడికి అండగా నిలుస్తూ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ అనారోగ్యంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటి జర్నలిస్టు కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవడం ద్వారా ప్రెస్ క్లబ్ సభ్యులు జర్నలిస్టుల మధ్య ఉన్న ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కోరుట్ల సీఐగా కొమ్ము తిరుపతి నియామకం

కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:
కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కొమ్ము తిరుపతి బదిలీ అయ్యారు. మల్టీ జోన్–1 పరిధిలో ఇన్స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీపీటీసీలో పనిచేస్తున్న కొమ్ము తిరుపతిని కోరుట్ల సర్కిల్‌కు బదిలీ చేశారు. గతంలో కోరుట్లలో పనిచేసిన లక్ష్మీనారాయణను మల్టీ జోన్ కార్యాలయానికి బదిలీ చేసిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.



# కందికట్కూర్ బస్టాండ్‌లో అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గమ్మ తల్లి దర్శనం

## కూరగాయలతో అలంకరణ. భక్తులకు కనువిందు చేస్తున్న అమ్మవారి దివ్యరూపం

ఇల్లంతకుంట అక్టోబర్ 13(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ బస్టాండ్‌లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే అన్నపూర్ణ మాత రూపంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పచ్చని ఆకులు, పూలమాలలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అమ్మవారి దివ్యరూపం, ఇరువైపులా సింహాల ప్రతిరూపాలు, ఎర్రని కాంతులతో మెరిసిపోతున్న మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అన్నమే పరబ్రహ్మ స్వరూపం అనే సందేశాన్ని చాటుతూ అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం భక్తి భావానికి, ప్రకృతి పట్ల గౌరవానికి, అన్నదాతల కష్టానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ కటాక్షం ఉండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తున్నారు.



# కోరుట్ల రవాణా శాఖలో ఏజెంట్ల దందాకు అడ్డుకట్ట పడిందా?

## ఏసీబీ దాడుల తర్వాత మారని పరిస్థితులపై ప్రజల్లో చర్చ.. - ఒక్కో ఏజెంట్‌కు ఒక్కో కోడ్ అంటూ ఆరోపణలు!

కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:
కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించిన అనంతరం అక్కడి పరిస్థితుల్లో మార్పు వచ్చిందా? ఏజెంట్ల ద్వారా జరిగే పనులకు అడ్డుకట్ట పడిందా? లేక పాత పద్ధతులే కొనసాగుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.రవాణా శాఖ కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర సేవల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో ఏజెంట్ల పాత్ర ఎంతవరకు ఉంది? ప్రభుత్వ నిర్ణయించిన రుసుములకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



**ఒక్కో ఏజెంట్‌కు ఒక్కో కోడ్.. ఏమిటీ వ్యవహారం?:**

కార్యాలయంలో ఏజెంట్లకు ప్రత్యేక కోడ్లు కేటాయించి పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కోడ్ల వెనుక ఉన్న వ్యవహారం ఏమిటి? వాటిని ఎవరు కేటాయించారు? వాటి ఆధారంగా ఎలాంటి సేవలు అందిస్తున్నారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన అధికారిక ఆధారాలు, సంబంధిత అధికారుల వివరణ వెలుగులోకి రావాల్సి ఉంది.

**– నెలకు లక్షల రూపాయల మామూళ్లు?:**

రవాణా శాఖ కార్యాలయంలో నెలవారీగా లక్షల రూపాయల మేర మామూళ్లు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు కూడా చర్చకు వస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే వాటి వెనుక ఎవరున్నారు? డబ్బులు ఎవరి నుంచి ఎవరికీ చేరుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. ఆరోపణల తీవ్రత దృష్ట్యా సంబంధిత రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తుల పాత్రపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**– ఏసీబీ దాడుల ఉద్దేశం నెరవేరిందా?:**

అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచడం, సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడం ఏసీబీ చర్యల ప్రధాన లక్ష్యాలు. అయితే దాడుల అనంతరం కూడా అక్రమ వసూళ్లపై ఆరోపణలు వినిపిస్తుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులను మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఏర్పడుతుంది. కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలపై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఏజెంట్ల పాత్రను పరిశీలించడంతో పాటు, ప్రభుత్వ రుసుముల వివరాలను ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాలి. అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిని విచారించి, ఆధారాలు లభించిన పక్షంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

**– ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి:**

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తమ పనుల కోసం అనవసరంగా మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండకూడదు. నిర్ణీత రుసుములతోనే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. ఏసీబీ దాడుల అనంతరం కోరుట్ల రవాణా శాఖలో ఎలాంటి మార్పులు వచ్చాయి? ఏజెంట్ల వ్యవస్థపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నెలవారీ మామూళ్ల ఆరోపణల్లో వాస్తవాలేమిటి? అనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్రజల ప్రశ్న ఒక్కటే.. ఏసీబీ దాడులతో అక్రమాలకు నిజంగా అడ్డుకట్ట పడిందా? లేక దాడుల తర్వాత కూడా ఆరోపణలు కొనసాగుతున్నాయా? ఈ ప్రశ్నలకు అధికారిక విచారణ, ఆధారాలు, సంబంధిత అధికారుల స్పందన ద్వారానే స్పష్టత రానుంది.

# భార్య సర్పంచ్ భర్త పెత్తనం

## గొల్లపెల్లి మండలం మల్లన్నపేటలో సర్పంచ్ భర్త అధికార దుర్వినియోగంపై ఆరోపణలు

## సర్పంచ్ లేకుండానే హైమాస్ట్ లైట్ల ప్రారంభం ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు అవమానం

## జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామన్న ఉప సర్పంచ్

గొల్లపెల్లి అక్టోబర్ 12 ప్రజాజ్యోతి :
ముత్యాల స్వామి గ్రామంలో సర్పంచ్ పదవి భార్యదైతే పెత్తనం మాత్రం భర్తదా? అన్న విమర్శలు గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో వెల్లువెత్తుతున్నాయి సర్పంచ్ సిద్దెంకి లక్ష్మి భర్త, ఐదో వార్డు సభ్యుడు సిద్దెంకి మల్లారెడ్డి సర్పంచ్‌కు బదులుగా తానే అధికారాలు చలాయిస్తున్నారంటూ గ్రామ ఉప సర్పంచ్ ముత్యాల స్వామి ఆరోపించారు భార్య పదవిని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు గ్రామ సర్పంచ్ లక్ష్మి అందుబాటులో లేని సమయంలోనూ ఆమె భర్త మల్లారెడ్డి సర్పంచ్ హోదాలో వ్యవహరిస్తూ వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారని ఉప సర్పంచ్ ఆరోపించారు గ్రామంలో ఉప సర్పంచ్‌తో పాటు తోటి వార్డు సభ్యులకు కనీస ప్రోటోకాల్ మర్యాదలు సైతం పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.





**హైమాస్ట్ లైట్ల ప్రారంభంపై వివాదం**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం వివాదానికి దారితీసింది సర్పంచ్ లక్ష్మి లేకుండానే ఆమె భర్త మల్లారెడ్డి వాటిని ప్రారంభించడంపై ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు ప్రజాప్రతినిధుల హోదాలు బాధ్యతలను పక్కనపెట్టి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు ఎన్నికైన ప్రజాప్రతినిధుల హక్కులు గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి భార్య పదవిని అడ్డం పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.అయితే ఇలా చేయడం మొదటిసారి కాదని గతంలోను పలు సందర్భాలలో ఇలాంటి ఘటనలే జరిగాయని తెలిపారు. ఈ వ్యవహారంపై త్వరలోనే జిల్లా పంచాయతీ అధికారిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఉప సర్పంచ్ ముత్యాల స్వామి తెలిపారు గ్రామ పంచాయతీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. మల్లన్నపేటలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

## సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి

## ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

ముస్తాబాద్, అక్టోబర్ 13( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు అందుతున్న సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని సత్వర న్యాయం అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.






**సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి:**

గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి:**

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, డయల్ 112కు కాల్ వచ్చిన వెంటనే పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. ఆపదలో ఉన్న బాధితులకు తక్షణ సహాయం అందిస్తూ పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.
అలాగే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్

కరీంనగర్ రూరల్: అక్టోబర్ 13( ప్రజాజ్యోతి ):
మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ అన్నారు. కరీంనగర్ రూరల్




మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని చర్చించారు.

# వృద్ధుడి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన హోంగార్డు

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 13, (ప్రజాజ్యోతి):
వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడిని కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్‌కు చెందిన హోంగార్డు వి. అంజనేయులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు.బొమ్మిడేని కొమురయ్య (80) అనే వృద్ధుడు వ్యక్తిగత సమస్యల కారణంగా మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా,విధుల్లో



ఉన్న హోంగార్డు వి. అంజనేయులు తక్షణమే స్పందించి ఆయన ప్రాణాలను కాపాడారు.అనంతరం వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సందర్భంగా లేక్ అవుట్‌పోస్ట్ ఆర్ఎస్ఐ బి. రమేష్ వృద్ధుడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.వృద్ధుడికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని,వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆయనకు ధైర్యం చెబుతూ,సమస్యలను ఎదుర్కొనేలా సహకరించాలని సూచించారు.ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి వృద్ధుడి ప్రాణాలను కాపాడిన హోంగార్డుని పోలీసు అధికారులు అభినందించారు.

# అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ విద్యార్థి ఎంపిక

కరీంనగర్,అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి ):
శ్రీలంకలో అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థి కె. ఆదిత్య సాయి



ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు.
అంతర్జాతీయ వేదికపై ప్రతిభను చాటుకుని, పోటీల్లో విజయం సాధించి పాఠశాలతో పాటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆదిత్య సాయి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రాజుపాలెం సోలార్ ప్లాంట్‌లో మరోసారి కేబుల్స్ చోరీ!

★ రూ.10 లక్షల విలువైన కేబుల్స్ అపహరణ.. ఆరు నెలల క్రితం రూ.5 లక్షల నష్టం
★ వరుస చోరీలతో ఆందోళనలో నిర్వాహకులు.. పోలీసులకు ఫిర్యాదు



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలోని మణితేజ--లక్ష్మి 2.4 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో మరోసారి కేబుల్స్ చోరీ ఘటన కలకలం రేపింది. సుమారు రూ.10 లక్షల విలువైన కేబుల్స్ అపహరణకు గురైనట్లు ప్రాజెక్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్లాంట్‌లోని 200 మీటర్ల ఆర్ఎస్ 485 కేబుల్‌తో పాటు 2,000 మీటర్ల హోలీ క్యాబ్ 6 ఎస్క్యూ ఎంఎండిసి కేబుల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. గతంలోనూ ఇదే ప్లాంట్‌లో సుమారు ఆరు నెలల క్రితం రూ.5 లక్షల విలువైన డిసి కేబుల్స్ చోరీకి గురయ్యాయని తెలిపారు. అప్పట్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ, ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతోనే మరోసారి చోరీ జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరుస చోరీలతో తీవ్రంగా నష్టపోతున్నాం. స్వచ్ఛమైన, పర్యావరణహితమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సమాజానికి అందించాలనే లక్ష్యంతో సోలార్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నామని బాధితులు తెలిపారు. అయితే, వరుస చోరీల కారణంగా భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్స్ అపహరణతో విద్యుత్ ఉత్పత్తికి కూడా అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించి, సమగ్ర విచారణ జరిపి చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని బాధితులు కోరారు. చోరీకి గురైన కేబుల్స్‌ను రికవరీ చేసి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్లాంట్‌కు తగిన భద్రత కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయం

★ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్
★ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు: వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు









**సత్తుపల్లి అక్టోబర్13 (ప్రజా జ్యోతి)** సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్న సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్‌కు ఐఎన్‌టీయూసీ సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు, సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆమె ఈ అంశాలను శాసనసభలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని కోటేశ్వరరావు తెలిపారు.సింగరేణి కార్మికులకు ప్రకటించిన కీలక ప్రయోజనాలు,లాభాల వాటా సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా కింద రూ.1,754 కోట్ల పంపిణీ, ఒక్కో కార్మికుడికి సగటున సుమారు రూ.1.54 లక్షలు అందే అవకాశం ఉందని, కాంట్రాక్టు కార్మికులకు బోనస్: కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 ప్రత్యేక ఆర్థిక ప్రయోజనం అందించనున్నట్లు,సొంత ఇంటి కల: ప్రతి కార్మిక కుటుంబానికి ఇంటి స్థలం కల్పించాలన్న డిమాండ్‌పై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.పన్ను మినహాయింపు: అధికారులకు వర్తించే పెర్క్విజిట్స్ పన్ను మినహాయింపు సౌకర్యాన్ని కార్మికులకు కూడా వర్తింపజేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.మారుపేర్ల సమస్య పరిష్కారం ఏళ్ల తరబడి కార్మికులను ఇబ్బంది పెడుతున్న మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.డిస్మిస్ అయిన కార్మికులకు ఉపశమనం: ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి ఉద్యోగంలోకి వచ్చే అవకాశం కల్పించే అంశంపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల నియామక పత్రాలను 15 రోజుల్లో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.వైద్య సేవల మెరుగుదల: కార్మికులను ఇతర ప్రాంతాలకు తిప్పకుండా ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ నిర్వహించేలా, ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.క్వార్టర్లు, కాలనీల అభివృద్ధి: డి-టైప్ క్వార్టర్ల ఆధునీకరణతో పాటు నెహ్రూ హౌసింగ్ కాలనీ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

**కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు**

సింగరేణి కార్మికుల సమస్యలను కేవలం సభలో ప్రస్తావించడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ స్థాయిలో చొరవ చూపుతున్న ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌కు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్‌కు కార్మికుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.కార్మికుల చెమట బొట్టుకు తగిన విలువ లభించేలా, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేలా, భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇదే విధమైన చొరవను కొనసాగించాలని కోరుతూ, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌కు, ఐఎన్‌టీయూసీ నాయకులు డా. బి. జనక్ ప్రసాద్‌కు సింగరేణి కార్మికుల తరఫున మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.


# హీరో బైక్స్ హీరోని చేస్తుంది

★ దసరా,దీపావళి పండుగకి బంపర్ ఆఫర్స్
★ ప్రతి హీరో వాహన కొనుగోలుపై 6000 తగ్గింపు
★ 6,999కే అతి తక్కువ డౌన్ పేమెంట్
★ స్పాట్ ఎక్స్ ఛేంజ్, స్పాట్ ఫైనాన్స్, స్పాట్ రిజిస్ట్రేషన్, స్పాట్ డెలివరీ
★ శ్రీభార్గవ ఆటో మొబైల్స్ అధినేత నాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 13, ప్రజాజ్యోతి** హీరో బైక్స్ భారతదేశంలోనే హోమ్ బ్రాండ్ అని, కోట్లాది మంది కస్టమర్లు హీరో బైక్స్ నే ఇష్టపడుతారని,హీరో బైక్స్ ప్రతి కస్టమర్ ని హీరోని చేస్తుందని మణుగూరు,పినపాక మండలాల శ్రీభార్గవ ఆటో మొబైల్స్ అధినేత నాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన షోర్ రూమ్ లో మాట్లాడుతూ దసరా,దీపావళి పండుగకి ప్రతి హీరో బైక్ పై బంపర్ ఆఫర్స్ ఉందని ప్రతి హీరో కస్టమర్ ఈఆఫర్స్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పండుగలు ప్రతి కస్టమర్




లో కొత్త ఆనందాన్ని తెస్తుందని తెలిపారు. దసరా పండుగ తర్వాత దీపావళి పండుగకి కూడా ఈబంపర్ ఆఫర్స్ వస్తోందని కస్టమర్లకు తెలియజేశారు. అలాగే ఈ ఆఫర్ స్టాక్ ఉన్నంత వరకే లభిస్తుందని కస్టమర్లకు గుర్తు చేశారు. ప్రతి హీరో వాహనం కొనుగోలుపై 6000 భారీ డిస్కౌంట్ ఉందని తెలియజేశారు. అలాగే 6,999 రూపాయలకే అతి తక్కువ డౌన్ పేమెంట్, తక్కువ శాతం వడ్డీ కలదని నొక్కి చెప్పారు. తమ శ్రీభార్గవ ఆటో మొబైల్స్ లలో స్పాట్ ఎక్స్ ఛేంజ్, స్పాట్ ఫైనాన్స్,స్పాట్ రిజిస్ట్రేషన్, స్పాట్ డెలివరీ సదుపాయాలు ఉన్నాయని కస్టమర్లకు గుర్తు చేశారు. కస్టమర్ల దెగ్గర ఉన్న తమ పాత వాహనాన్ని భార్గవ ఆటో మొబైల్స్ లో ఇచ్చేసి కొంత హీరో వాహనాన్ని తమ ఇంటికి తీసుకుపోవచ్చని కస్టమర్లకు తెలిపారు. ఈదసరా, దీపావళికి హీరో మోటోకార్ప్ హీరో డీలక్స్, హీరో స్ప్లెండర్ ఎక్స్‌టెక్, స్ప్లెండర్ ప్లస్ ఎక్స్‌టెక్, ప్యాషన్ ప్లస్‌తో సహా కొన్ని ట్రిమ్ మోడల్‌లను కూడా విడుదల చేస్తోందని చెప్పారు.హీరోని నమ్మినందుకు కస్టమర్‌లకు మేము ఈ ఆఫర్స్ ను అందిస్తున్నామని తెలిపారు. మరింత పూర్తి సమాచారం కోసం 9866264998, 9866366078 ఈనెంబర్లని సంప్రదించవచ్చని ఆయన తెలియజేశారు.


## ఖమ్మం జిల్లా మున్నూరు కాపు ఉపాధ్యక్షుడిగా పసుపులేటి నాగేంద్ర

# శ్రీనివాసరావు, యూత్ ఉపాధ్యక్షుడిగా ఈశ్వర్ రవితేజ ప్రమాణ స్వీకారం





**మధిర / ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** ఖమ్మంలో జరిగిన జిల్లా మున్నూరు కాపు మహాసభ ప్రమాణ స్వీకారంలో ఎర్రుపాలెం మండలం, ఎర్రుపాలెం గ్రామ వాస్తవ్యులు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు ఖమ్మం జిల్లా మున్నూరు కాపు ఉపాధ్యక్షుడిగా పసుపులేటి ఈశ్వర్ రవితేజ జిల్లా మున్నూరు కాపు యూత్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. గత 40 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, అందరివాడిగా, అభిమాన నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్న పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు ప్రజా సేవకే అంకితమయ్యారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే, ప్రజలకు దగ్గరవుతూ అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు.

**నిర్వహించిన పదవులు:**

మాజీ ఎర్రుపాలెం సొసైటీ ఉపాధ్యక్షుడు, వార్డు సభ్యుడు, రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టుగా ప్రజాపాలన జాతీయ తెలుగు దినపత్రిక మరియు ప్రైమ్ నైన్ విలేకరిగా, మధిర చిరు వ్యాపారస్తుల సంఘ అధ్యక్షుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జిల్లా ఇందిరా రాజీవ్ యువసేన ప్రధాన కార్యదర్శి, మండల మాజీ మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. నేడు జిల్లా మున్నూరు కాపు ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ప్రజా మనిషిగా, కళాకారుడిగా అనేక సేవా కార్యక్రమాల్లో ఆయన సేవలు **చిరస్మరణీయం.**

ఈ సందర్భంగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు కుటుంబానికి పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కి, జిల్లా అధ్యక్షులు మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ , నియోజకవర్గ అధ్యక్షుడు ఆళ్ళ కృష్ణ జిల్లా మున్నూరు కాపు కుల బాంధవులకు, మధిర మండల పట్టణ కుల బంధువులకు, రాజకీయ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రమాణ స్వీకారం చేసిన పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు కు మధిర పట్టణ రాజకీయ నాయకులు, ప్రముఖులు, మున్నూరు కాపు కుల బాంధవులు అభినందనలు తెలిపారు.

## మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో బతుకమ్మ సంబరాలు

**మణుగూరు క్రైమ్. అక్టోబర్ 13, ప్రజాజ్యోతి..** మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం





బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపాల్ ఓ సారంగపాణి బతుకమ్మ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగన్నారు. అనంతరం విద్యార్థులు రంగురంగుల పూలతో ఏర్పాటు చేసిన బతుకమ్మలతో ఆడి పాడి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి ఎన్ జ్యోతిరాణి, ఏటీవోలు ఎం శ్రీనివాసరావు జీవీ కృష్ణారావు ఏ నర్సయ్య వేణుగోపాల్ నాయుడు, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటిసి మాస్టర్ ట్రైనర్స్ పూర్ణచంద్రరావు కార్తికేయ లతోపాటు ఏటిసి ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ

# స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

★ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
★ పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి, పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు రూ. 4.26 కోట్లు మంజూరు
★ కంబోడియా, థాయ్‌లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు








**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి,పురావస్తు కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణపై బౌద్ధ భిక్షువుల సలహాలు, సూచనలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు.నేలకొండపల్లి లో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం, బౌద్ధ విహారాలు, సమావేశ మందిరాలు, ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని, ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతోపాటు, దేశవిదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు.కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా, బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా,దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.హా అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ (కోర్ టీమ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బౌద్ధ భిక్షువులు, నిపుణుల సలహాలు,సూచనలను స్వీకరించి వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో నేలకొండపల్లిని అత్యున్నత బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. జీవనంలో మోహాలు, మాయలు వీడి, గౌతమ బుద్ధుడు చూపిన మధ్యే మార్గం ద్వారానే మానవజాతి శాంతియుతంగా జీవించగలదని, అటువంటి మహోన్నత జ్ఞానాన్ని అందించిన బౌద్ధ ధర్మ ప్రచారానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల సరసన నేలకొండపల్లిని టాప్-3 లో నిలపడమే లక్ష్యమని అన్నారు.కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.అభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు, సందర్శకుల మార్గాలు, ప్రాంగణ సుందరీకరణ, సమాచార సూచికలు, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు, సమావేశ మందిరం, సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్, తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం, చారిత్రక ప్రాధాన్యత, నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు. కంబోడియా,థాయ్‌లాండ్,భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం, బౌద్ధ విహారాలు,ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు, పర్యాటక రంగ నిపుణులు, కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ ప్రణాళికలో మహాస్తూపం పరిరక్షణ, బౌద్ధ విహారాల పునరుద్ధరణ, పర్యాటక మౌళిక సదుపాయాల అభివృద్ధి,సందర్శకుల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, బౌద్ధ చరిత్రను వివరించే సమాచార వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమీషనర్ పివి. శ్రీనివాస రావు,హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డా. పి. నాగరాజు, ఎన్. నరసింగ్,సూపరింటెండెంట్ ఎ. రాజు,జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, హైదరాబాద్ ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఇ.శివనాగిరెడ్డి,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు, పురావస్తు పరిశోధకులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో ఘనంగా బతుకమ్మ చీరల పంపిణీ

★ 150 కుటుంబాలకు పైగా మహిళలకు చీరల అందజేత
★ నాలుగు బతుకమ్మల గద్దెల వద్ద ఎల్ఈడీ లైట్లు బహూకరణ





**పినపాక, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామంలో సర్పంచ్ సుతారి సింధూజ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 150 కుటుంబాలకు పైగా మహిళలకు చీరలను పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల్లో పండుగ సంతోషాన్ని నింపడంతో పాటు, తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**సొంత ఖర్చులతో చీరల పంపిణీ**

గ్రామంలోని మహిళల పట్ల గౌరవం, ఆప్యాయతను చాటుతూ సర్పంచ్ సుతారి సింధూజ, తన సొంత ఖర్చులతో చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలు అందజేయడం ద్వారా పండుగ ఆనందాన్ని పంచుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. చీరలు అందుకున్న మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

# పాలకుల నిర్లక్ష్యం పై త్వరలో పాత్రికేయుల పోరుబాట

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మాట తప్పిన పాలకుల వైఖరి పై త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ చేపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, టీజేయు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏటీ రాజారావు, కే.



రాజశేఖర్ యాదవ్ లతో పాటు పలువురు స్థానిక జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. ఈ సందర్భంగా వీరికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని, అక్రెడిటేషన్ కార్డుల పంపిణి వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని, జర్నలిస్టుల ఆరోగ్య సమస్య, సామాజిక భద్రతలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందు పడుతున్నారని, ఇంటి జాగల కోసం ఎదురు చూసి ఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక చిన్న, మధ్యతరహా పత్రికలు, కేబుల్ ఛానళ్ళు మూతపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై త్వరలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ఉంటుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ కు జర్నలిస్టులంతా అండగా ఉండాలని, జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. సంగారెడ్డి జిల్లాలో త్వరలో నూతన నాయకత్వంలో మహాసభ జరుగుతుందని తెలిపారు.

# పుష్కరాల పనుల్లో వేగం పెంచి, గడువులోగా పూర్తి చేయండి..

### ఐటీసీ నుంచి భద్రాచలం వంతెన వరకు రహదారి సుందరీకరణకు వారం రోజుల్లో ప్రణాళిక

### ఆలయ అభివృద్ధి, ఘాట్ల నిర్మాణాలపై కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి సమీక్ష

భద్రాచలం, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి): గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని



సమీక్షించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్.. స్లాబ్‌లు, రక్షణ గోడలు, మట్టి నింపే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఆలయం నుంచి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని ప్రస్తుతం ఉన్న 25 అడుగుల నుంచి 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. గోదావరి ఉత్తర వైపు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల మేర చేపడుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలను పరిశీలించి, మెట్లు, దిగే ప్రాంతాలు, రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించాలన్నారు. పాత గోడలకు ఏర్పడిన పగుళ్లకు మరమ్మతులు చేపట్టాలని, పర్ణశాల వద్ద టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, జీపీ ఈవో శ్రీనివాస్, దేవస్థానం డీఈ రవీందర్ రావు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

మొదటిపేజీ తరువాయి..



తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతోపాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు నేతలకు దిశానిర్దేశం చేశారు.

# గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

### ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న డెవలప్మెంట్ చార్జీలను రద్దు చేయాలి

### గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి..

### సిపిఐఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా

### అవినీతి ఆరోపణలపై విచారణ చేసి రిపోర్ట్ అందివ్వాలి... డిపిఓ ని ఆదేశించిన సబ్ కలెక్టర్

భద్రాచలం , అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) గ్రామపంచాయతీలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని భద్రాచలం కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా స్వచ్ఛ పాలన అందించాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ప్లే కార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి గడ్డం



స్వామి మాట్లాడుతూ... డెవలప్మెంట్ చార్జీల పేరుతో ఇంటి యజమానుల వద్ద వసూలు చేస్తున్న చార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించుకున్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అధికారులే సర్వే చేసి ఇంటి పనులు వేయాలని కోరారు. గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచి సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు లేక పాశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ పెద్ద పండుగ దసరాకు సైతం వేతనాలు అందకపోతే కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం:**

గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సిపిఐఎం శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి



సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ట వినతి పత్రం అందించారు. సిపిఐఎం ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ సమగ్ర రిపోర్టును తనకి ఇవ్వాలని డిపిఓ కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ గ్రామపంచాయతీ పై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తామని సిపిఐఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ అవినీతి అక్రమాలపై సబ్ కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల సిపిఐఎం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాయిపేట ఆదివాసీ గిరిజ నుల పై పోలీసుల పంజా

### విధి నిర్వహణలో ఉన్న పో లీసులపై దాడి చేసిన 20 మంది నిందితుల అరెస్ట్

### గంజాయి కేసు దర్యాప్తుకు వెళ్లిన పోలీసులపై రాళ్లు, క ర్రలతో దాడి

### ఐదుగురు పోలీసులకు గా యాలు

### ప్రభుత్వ పోలీసు వాహనం ధ్వంసం

### సోమవారం ఏడుగురు, మంగళవారం మరో 13 మంది అరెస్ట్

### పోలీసుల విధులకు ఆటం కం కలిగించినా, దాడులకు పాల్పడినా కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 13, (ప్రజా జ్యోతి): మారుమూల వాయి పేట ఆ దివాసీ గిరిజనుల పై పోలీ సులు ఎట్టకేలకు పంజా విసి రారు.విధి నిర్వహణలో ఉ న్న




పోలీసులపై దాడి చేసి, వారిని నిర్బంధించి, ప్రభు త్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనలో మొత్తం 20 మంది నిందితు లను అరెస్ట్ చేశారు. సోమ వారం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మంగ ళవారం మరో 13 మంది నిందితులను అరెస్ట్ చేసిన ట్లు మంగళవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్ట ర్స్ లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో వివరా లను వెల్లడించారు. సిరికొం డ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపేట గ్రామంలో అక్టో బర్ 10వ తేదీ ఉదయం గం జాయి కేసు దర్యాప్తులో భా గంగా వెళ్లిన పోలీసు సిబ్బం దిపై ఈ దాడి జరిగింది. సిరి కొండ పోలీస్ స్టేషన్‌లో న మోదైన క్రైమ్ నంబర్ 90/2 026, ఎన్ డి పి ఎస్ చట్టం కింద ఉన్న గంజాయి కేసు దర్యాప్తు నిమిత్తం ఇచ్చోడ సీఐ సీహెచ్. రమేష్, కానిస్టే బుల్ బత్తుల శివప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు పోలీ సు సిబ్బంది ప్రభుత్వ పోలీ సు వాహనంలో బంగారుపే ట గ్రామానికి వెళ్లారు. గంజా యి కేసులో నిందితుడిని అ రెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చిన నేపథ్యంలో, కొందరు వ్యక్తులు గుంపుగా ఏర్పడి పోలీసులపై దాడికి పాల్పడి నట్లు ఫిర్యాదులో పేర్కొన్నా రు. పోలీసు వాహనంపై రా ళ్లు రువ్వడంతో పాటు, పో లీసు సిబ్బందిపై కర్రలతో దా డి చేసి గాయపరిచినట్లు, వారిని బలవంతంగా సర్పం చ్ ఇంటికి తీసుకెళ్లి నిర్బం ధించినట్లు తెలిపారు. అంతే కాకుండా పోలీసులను చం పుతామని బెదిరించడం, ప్ర భుత్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడం, ప్రభుత్వ ఫోన్‌ను ధ్వంసం చేయడం తో పాటు మరో సెల్‌ఫోన్, క్రైమ్ నంబర్ 79/2026కు సంబంధించిన సీడీ ఫైల్‌ను అపహరించినట్లు తెలిపా రు. ఈ ఘటనలో కానిస్టేబు ల్ బత్తుల శివప్రసాద్ ఎడ మ చేతికి ఎముక విరగగా, ఇచ్చోడ సీఐ సీహెచ్. రమే ష్ భుజం, వీపు భాగాల్లో గా యాలయ్యాయి. ఏఎస్ఐ రాథోడ్ బలిరామ్ ఎడమ చే యి, తొడ, భుజానికి గాయా లయ్యాయి. ఏఆర్ హెడ్ కా నిస్టేబుల్ భీంరావుకు కుడి చేయి, నడుము భాగాల్లో గాయాలు కాగా, ఏఆర్ కాని స్టేబుల్ గంగారాంకు తలపై రక్తస్రావ గాయమైంది. ఈ ఘటనపై కానిస్టేబుల్ బత్తు ల శివప్రసాద్ ఫిర్యాదు మేర కు సిరికొండ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 92/2026 కింద బి ఎన్ ఎస్ సెక్షన్లు 109, 303(2), 137, 121, 140, 191 r/w 190, ప్రభు త్వ ఆస్తుల నష్టం నివారణ చట్టం (పిడిపిపి యాక్ట్ ) సెక్ష న్ 3 కింద కేసు నమోదు చే శారు. కేసు దర్యాప్తును ఇ చ్చోడ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించి, దర్యాప్తులో భా గంగా నిందితులను అరెస్ట్ చేశారు.

**నిందితుల అరెస్ట్ వివరాలు:**

ఎ1 నుంచి ఎ7 వరకు ఏడు గురు నిందితులను 12 న అరెస్ట్ చేసి, న్యాయస్థానం లో హాజరుపరిచి (హైదరా బాద్ జైలు) రిమాండ్‌కు తర లించారు. ఎ8 నుంచి ఎ20 వరకు: 13 మంది నిందితు లను 13 న అరెస్ట్ చేసి, న్యా యస్థానంలో హాజరుపరిచా రు. అరెస్ట్ అయిన వారిలో సిరికొండ మండలం వాయి పేట గ్రామానికి చెందిన స ర్పంచ్ చిక్రం రాము, గ్రామ పటేల్ పెందూర్ బాదు పటే ల్ @ పెందూర్ బదిరావు, మాజీ ఎంపిటీసి సభ్యుడు పెందూర్ మారుతి,చాకటి ఇంద్రకాంత్, సెడ్మాకే భీంరా వు, పెందూర్ అరుణ్ కుమా ర్, పెందోర్ శ్రీరామ్,పెందోర్ జ్యోతిరామ్,కినక భీంరావు, పెందూర్ మహేశ్వర్, పెం దూర్ రవి,పోయం తిరుప తి,ఆత్రం జల్పతిరావు, పెం దూర్ మనోహర్, సిడాం నరే ష్,గడ్డం విజయ్ కుమార్, చేదం శ్రీనివాస్,పెందోర్ సో ము,పోయం గంగారాం లు ఉన్నారు.దాడిలో పాల్పడిన ఇతరుల పాత్ర పై దర్యాప్తు కొనసాగుతుందని, దాడిలో పాల్పడిన ప్రతి ఒక్కరిపై కే సులు నమోదు చేయడం జ రుగుతుందని, చట్టం దృష్టి లో ప్రతి ఒక్కరు సమానమే నని తెలియజేశారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐ పీఎస్ మాట్లాడుతూ పోలీ సు సిబ్బంది చట్టబద్ధంగా వి ధులు నిర్వహిస్తున్న సమ యంలో వారిపై దాడి చేయ డం, విధులకు ఆటంకం కలి గించడం, ప్రభుత్వ ఆస్తుల ను ధ్వంసం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణి స్తామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పోలీసు లపై దాడులకు పాల్పడే వా రిపై చట్టప్రకారం కఠిన చర్య లు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్ర తల పరిరక్షణకు పోలీసు శా ఖ నిరంతరం కృషి చేస్తోంద ని, నేరాల నియంత్రణలో ప్ర జలు పోలీసులకు సహకరిం చాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఉట్నూర్ ఏఎస్పి రు త్వీక్ సాయి కొట్టే ఐపీఎస్ పాల్గొన్నారు.

# ఓటరు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు..

### ఈ నెల 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ..

### అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి..

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి): అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా హనుమకొండ జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడు



తున్నట్లు మంగళవారం వెల్లడించారు. ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని అర్హులు, తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన వారు తమ సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఫారం-6 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక శిబిరాల సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలి.. అనర్హుల పేర్లు ఉండకూడదు అనేదే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవడంతో పాటు, పేరు నమోదు కాని అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం తమ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారులను లేదా హనుమకొండ జిల్లా ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్



మొదటిపేజీ తరువాయి..

రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి.. తెలంగాణలో చేపట్టాల్సిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు. ఈ భేటీలో కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి, హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్, రోప్‌వేలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు సహా అనేక ప్రతిపాదనలు ప్రస్తావనకు వచ్చాయి. హైదరాబాద్ తూర్పు వైపు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో ఎల్బీనగర్, హయత్‌నగర్ చాలా ముఖ్యమైన ప్రాంతాలు. ఈ మార్గంలో వాహనాల రద్దీని తగ్గించేందుకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన కీలకంగా మారింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్ అందుబాటులోకి వస్తే రహదారి సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, మార్గం, పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేయాల్సిన గడువు వంటి వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాతే స్పష్టత రానుంది. కేంద్రం ఆమోదం తెలిపినట్లు ప్రకటించినప్పటికీ.. తదుపరి పరిపాలనా అనుమతులు, సాంకేతిక ప్రక్రియలు, నిధుల కేటాయింపు వంటి దశలు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నాయి. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా అనుసంధానాన్ని మెరుగుపరిచే మరో ముఖ్యమైన ప్రతిపాదన కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం. జాతీయ రహదారి ఎన్‌హెచ్-167ఖపై నిర్మించనున్న ఈ బ్రిడ్జికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రమంత్రి ఆమోదం తెలిపినట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి అయితే 2 రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం కలగడంతో పాటు.. ప్రాంతీయ రవాణా, పర్యాటక రంగాలకు ఊతం లభించే అవకాశం ఉంది. వంతెన నిర్మాణానికి సంబంధించిన తదుపరి పనులు, శంకుస్థాపన తేదీ, నిర్మాణ షెడ్యూల్‌పై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనపైనా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. డీపీఆర్‌లో ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ వ్యయం, అవసరమైన భూసేకరణ, సాంకేతిక అంశాలు వంటి వివరాలను పరిశీలించనున్నారు.

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

మొదటిపేజీ తరువాయి..

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

కాగా ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

# ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు

మొదటిపేజీ తరువాయి..

ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు. అందువల్ల ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే మార్గాలను గుర్తించి, వాటిని అడ్డుకోవాలని సభ్య దేశాలకు సూచించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలపై కూడా కలిసి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేరాలకు పాల్పడిన వ్యక్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు సభ్య దేశాలు పరస్పరం సహకరించుకోవాలని అన్నారు. ఆయా దేశాల చట్టాలు, కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా న్యాయపరమైన సహాయం అందించుకోవడం, నిందితులను అప్పగించే విషయంలో సహకరించడం అవసరమని వివరించారు. ఇలాంటి చర్యల వల్ల నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరో పెద్ద సమస్యగా మారిందని అమిత్ షా చెప్పారు. ఈ అక్రమ రవాణాను ఒక్క దేశం మాత్రమే అడ్డుకోలేదని, అన్ని దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు నేర ముఠాలకు బలాన్ని ఇస్తోందని, అదే డబ్బును ఉగ్రవాద కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967